రంజాన్ వేళలు



	ఇఫ్తార్ (మంగళవారం సాయంత్రం)	సెహరీ (బుధవారం ఉదయం)
కడప	6.30	5.11
ప్రొద్దుటూరు	6.31	5.15



కుక్కల పేరుతో.. లక్షలు స్వాహా..!



కడప నగర శివార్లలో ఉన్న వీధి కుక్కల స్టెరిలైజేషన్ కేంద్రం

అగ్గిపుల్ల, కుక్కపిల్ల, సబ్బుబిళ్ల.. కవితకు కాదేదీ అనర్హం అన్నాడో కవి. ఇదే తరహాలో కార్పొరేషన్‌లో ప్రజాధనాన్ని స్వాహా చేసేందుకు ప్రతి అవకాశాన్ని వాడుకుంటున్నారు. కుక్కల నుంచి ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు వాటికి కుటుంబ నియంత్రణ (కు.ని) ఆపరేషన్లు చేస్తారు. అయితే కు.ని పేరుతో ఇక్కడి అధికార యంత్రాంగం లక్షల రూపాయల నిధులు కొట్టేసింది. కార్పొరేషన్ రికార్డుల్లో ఉన్న కుక్కల సర్జరీ లెక్కలు చూసి కొందరు అధికారులే ఔరా.. అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

- రికార్డుల్లో కు.ని సర్జరీల కనికట్టు
- ఆపరేషన్ లెక్కలు చూసి ఔరా అంటున్న అధికారులు
- ఇదీ కడప కార్పొరేషన్ తీరు

(కడప-ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్ 50 డివిజన్లు ఉన్నాయి. కార్పొరేషన్ పరిధిలోని కుక్కల నుంచి జనాలకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు, అవి కరిచినా ర్యాబిస్ రాకుండా ఉండటానికి వాటికి కు.ని ఆపరేషన్లు చేసి వ్యాక్సిన్ వేస్తారు. అయితే ఈ పేరుతో అధికార యంత్రాంగం నిధులు కుమ్మేశారనే ఆరోపణలున్నాయి. కార్పొరేషన్ పరిధిలో కుక్కల ఆపరేషన్ చేసే కేంద్రంలో ఉన్న వసతులు.. రికార్డుల్లో లెక్కలకు దీనికి అంతులేని వ్యత్యాసం ఉందంటారు. కుక్కలకు సర్జరీ పేరిట నిధులు దుర్వినియోగమయ్యాయని ఇటీవల స్టాండింగ్ కమిటీలో చర్చకొచ్చింది. దీనిపై ఆరా తీయగా పెద్ద స్కాం జరిగినట్లు తెలుస్తోంది.

ఇవీ నిబంధనలు..

కడప కార్పొరేషన్‌లో కుక్కల సర్జరీకి రాజస్థాన్‌కు చెందిన ఓఎన్జీవోతో ఒప్పందం కుదుర్చుకున్నారు. నగర శివార్లలో ఉన్న ఆ సంస్థ ఆపరేషన్ కేంద్రంలో రోజుకు 14 కుక్కలకు సర్జరీ చేసే వసతులు మాత్రమే ఉన్నాయి. సర్జరీ చేసే కుక్కను తీసుకువచ్చి దాన్ని ఆపరేషన్‌కు సన్నద్ధం చేయడం, సర్జరీ తరువాత కొద్దిరోజులు దానిని అక్కడే ఉంచి దానికి ఆహారం ఇవ్వడంతో పాటు వ్యాక్సిన్ వేయాల్సి ఉంది. అంటే వారం రోజుల పాటు ఆపరేషన్ కేంద్రంలోనే కుక్క ఉండాలి. కుక్కను ఎక్కడ నుంచి తీసుకువచ్చారో సర్జరీ తరువాత అక్కడే వదిలేయాలి. దీన్ని జియోట్యాగ్ చేయాలి. సర్జరీ చేసిన కుక్కకు గుర్తుగా దానికి ఒక కమ్మ వేయాలి. ఈ ప్రక్రియ మొత్తానికి ఒక కుక్కకు కార్పొరేషన్ వారు రూ.1,300 చెల్లిస్తారు.

ఇన్ని కుక్కలకు సర్జరీలా..

కడప కార్పొరేషన్ పరిధిలో 2023 అక్టోబరు నుంచి 2024 ఫిబ్రవరి వరకు 729 కుక్కలకు సర్జరీ చేశారు. గత ఏడాది మార్చి 23 నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు.. అంటే 13 రోజుల వ్యవధిలో 673 కుక్కలకు సర్జరీ చేశారు. ఏప్రిల్ 7 నుంచి 20వ తేదీ వరకు 600 కుక్కలకు, ఏప్రిల్ 24 నుంచి మే 6 వరకు 502 కుక్కలకు, మే 7 నుంచి 16వ తేదీ వరకు 519 కుక్కలకు సర్జరీ చేశారు. వాస్తవంగా అక్కడున్న వసతులు చూస్తే రోజుకు 14 కుక్కలకు మాత్రమే సర్జరీతో పాటు యాంటి ర్యాబిస్ వ్యాక్సిన్ వేసే అవకాశం ఉందంటారు. దీనిని బట్టి చూస్తే రికార్డులో ఉండేదానికి వాస్తవ పరిస్థితికి చాలా తేడా ఉంది. తిరుపతికి చెందిన వైద్యులు కుక్కలకు సర్జరీ చేస్తారు. వారు రోజూ రారు. 2016-17లో ఒక్కో కుక్కకు రూ.650 సర్జరీ, వ్యాక్సిన్‌కు చెల్లించేవారు. ఇప్పుడు రూ.1300 చెల్లించారు. రూ.10లక్షల లోపు అయితే కార్పొరేషన్‌లోనే బిల్లులు చెల్లిస్తారు. రూ.10 లక్షలు దాటితే బిల్లుల చెల్లింపులకోసం స్టాండింగ్ కమిటీకి పంపించాల్సి ఉంటుంది. కేవలం కుక్కల సర్జరీకి సంబంధించి స్టాండింగ్ కమిటీకి పంపించి జనరల్‌ఫండ్ నుంచి భారీగా నిధులు కాజేశారనే చర్చ నడుస్తోంది. కడపలో తిరుగుతున్న కుక్కలను చూస్తే ఎక్కడే కానీ వాటికి సర్జరీ చేసిన ఆనవాళ్లు కనిపించలేదని చెబుతున్నారు. కుక్కల పేరుతో లక్షలు కాజేశారనే చర్చ బాగా నడుస్తోంది.

ఈ విషయమై ఎంహెచ్‌వో చంద్రశేఖర్‌ను వివరణ కోరగా, ఇటీవల కార్పొరేషన్ పరిధిలో సుమారు 3,500 కుక్కలకు సర్జరీ చేశామన్నారు. తాను బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి 2,700 కుక్కలకు సర్జరీ చేసి రూ.35లక్షలు ఖర్చు చేశామన్నారు.

మంత్రి నారాలోకేశ్‌కు ఘనస్వాగతం



మంత్రి లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న బీటెక్ రవి

పులివెందుల టౌన్ / వేముల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు పులివెందులలో ఘన స్వాగతం పలికారు. మంత్రి సోమవారం కదిరిలో జరిగిన లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్లకు హాజరై విజయవాడకు విమానంలో వెళ్లేందుకు రోడ్డుమార్గాన కడపకు బయలుదేరారు. ఈ సందర్భంగా మార్గమధ్యంలోని పులివెందుల అంబకపల్లె క్రాస్ వద్ద దాదాపు 50 వాహనాలతో నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి, అతని సోదరుడు తుంగభద్ర హైలెవెల్ కెనాల్ చైర్మన్ జోగిరెడ్డి ఆధ్వర్యంలో వేలాది మంది కార్యకర్తలు అభిమానులు స్వాగతం పలికారు. వీరంతా కడప వరకు కాన్వాయ్‌గా మంత్రి వెంట వెళ్లారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూగుట్ల మధుసూదన్‌రెడ్డి, నల్లగారి భాస్కర్‌రెడ్డి, మహబూబ్‌బాషా, గంగాధర్‌రెడ్డి, అన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వేములలో పార్థసారథి రెడ్డి ఆధ్వర్యంలో మంత్రికి ఘన స్వాగతం పలికారు.

ఎమ్మెస్సీ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం ఎమ్మెస్సీ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య కేఎస్వీ కృష్ణారావు, డీన్ ఆచార్య ఏజీ దాముతో కలిసి విడుదల చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జనవరిలో నిర్వహించిన ఈ పరీక్షల ఫలితాలు త్వరితగతిన విడుదలకు కృషిచేసిన పరీక్షల విభాగాన్ని అభినందించారు. బోటనీ, బయోకెమిస్ట్రీ, జియాలజీ, మైక్రోబయాలజి, ఫిజిక్స్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, జెనెటిక్స్ అడ్ జినోమిక్స్ కాంపుటేషనల్ డేటా సైన్స్ కోర్సులలో వందశాతం ఉత్తీర్ణత లభించిందన్నారు. మ్యాథమేటిక్స్ 75శాతం, ఫుడ్ టెక్నాలజీ 95శాతం, జువాలజి 96.43శాతం, కంప్యూటర్ సైన్స్ 68శాతం, బయోటెక్నాలజీ 97.62శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారన్నారు.

ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలి: ఎస్పీ

కడప క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజలు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్‌హాలులో సోమవారం జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను విన్నారు. వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఫోను ద్వారా ఆదేశాలు జారీ చేశారు. మహిళల ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, పోలీసు స్టేషన్‌కు వచ్చే వారి సమస్యలను తెలుసుకుని బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ అబ్దుల్‌కరీం, మహిళా పీఎస్ డీఎస్పీ రమాకాంత్ పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి

- జాయింట్ కలెక్టర్ అదితి సింగ్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ అదితిసింగ్

కడప కలెక్టరేట్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు సమర్పించే బాధితుల సమస్యలకు సంబంధిత అధికారులు తక్షణమే నాణ్యమైన పరిష్కారాలు చూపాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు ఇళ్ల స్థలాలు, పెన్షన్లు, భూముల సరిహద్దులు, భూసమస్యలు తదితరాలపై జాయింట్ కలెక్టర్‌కు, అధికారులకు అర్జీలు సమర్పించారు. జేసీ అర్జీదారుల సమస్యలు వింటూ, సంబంధిత అధికారులతో అక్కడికక్కడే మాట్లాడుతూ వెంటనే పరిష్కారాలు చూపాలని అర్జీలను సిఫారసు చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయికి నేరుగా వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా పెండ్లిమర్రి మండలం గంగనపల్లికి చెందిన పెద్ద బాలగాండ్ల ఓబయ్య ఫిర్యాదుచేస్తూ 6 ఏళ్లుగా పొలతల మల్లికార్జునస్వామి గుడికి మామిడి తోరణాలు ప్రతి సోమవారం కట్టేవాడినని, దీనికి ప్రతిఫలంగా ఆలయ నిర్వాహకులు ప్రతి నెల రూ.15 వందలు ఇచ్చేవారని అన్నారు. ఇటీవల పొలతల తిరుణాలలో మామిడి తోరణాలు కట్టనివ్వకుండా ఆలయ ఈవో క్రిష్ణనాయక్ అడ్డుకుని జీవనోపాధి లేకుండా చేశారని తనకు న్యాయం చేయాలని కోరారు. ప్రొద్దుటూరు పరిధిలోని అమృతనగర్‌లో గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్ల పట్టాలు, అనుబంధ పత్రాలు ఇచ్చారు. 8 నెలలుగా అక్కడ నిర్మాణాలు చేసేందుకు వెళితే రెవెన్యూ అధికారులు అడ్డుకుంటున్నారని దీనిపై విచారణ జరిపి పేదలకు న్యాయం చేయాలని జైభీమ్ భారత్ పార్టీ నేతలు జేసీకి అర్జీ సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు, డీఆర్డీఏ, మెప్మా పీడీలు ఆనంద్ నాయక్, కిరణ్ కుమార్, ఎస్డీసీ వెంకటపతి, శ్రీనివాసులు తదితర అధికారులు పాల్గొన్నారు.

కడప పేరు చరిత్రపై
సమగ్ర నివేదిక

కడప కలెక్టరేట్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా పూర్వ నామం ఏమిటి? జిల్లాకు ఉన్న చరిత్ర, ఆ పేరు ఎందుకు పెట్టారు? అనే అంశాలపై పూర్తిస్థాయి నివేదిక అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కలెక్టర్‌ను కోరింది. దీనిపై పూర్తిగా విచారణ తాజాగా నివేదికలు ప్రభుత్వానికి పంపారు.

సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2009లో ప్రమాదవశాత్తు మరణించారు. ఆయన మరణాంతరం కడప జిల్లా పేరును డాక్టర్ వైఎస్సార్ జిల్లాగా నామకరణం చేస్తూ అప్పటి ప్రభుత్వం అభ్యంతరాలు, సూచనలను కోరింది. ఎంతో చారిత్రక ప్రాధాన్యం ఉన్న కడప పేరు తొలగింపు సరైంది కాదని అప్పట్లో ప్రజా సంఘాలు, పౌరహక్కుల సంఘాలు, కొన్ని రాజకీయ పార్టీలు అభ్యంతరాలు లేవనెత్తాయి. అయితే ఆ అభ్యంతరాలపై ప్రభుత్వం స్పందించక పోగా జిల్లా పేరులో కడప తొలగించడంతో పాటు డాక్టర్ వైఎస్సార్ జిల్లాగా పేరు మార్చారు. ఇటీవల రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కడప జిల్లా ప్రశస్తిని కాపాడాలని, కడపకు ఒక చరిత్ర ఉందని, తిరుమలేశుని తొలిగడప దేవుని గడప అని, వ్యవహారికంలో ఉచ్చారణలో తేడాల వల్ల కడపగా మారిందని కడప పేరునే కొనసాగించాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు విన్నవించారు. ఈ విషయంపై పూర్తి స్థాయిలో విచారణ చేసి సమగ్ర నివేదికలను కలెక్టరేట్ నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారని తెలుస్తోంది.



కడపలో చెన్నయ్ షాపింగ్‌మాల్ ప్రారంభం



చెన్నయ్ షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న సినీ నటి కీర్తి సురేశ్, క్రిష్ణారావు, చిత్రంలో మర్రి వెంకటరెడ్డి, శశిధర్‌రెడ్డి దంపతులు

కడప కల్చరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కడప ఆర్టీసీ బస్టాండు ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన 28వ చెన్నయ్ షాపింగ్‌మాల్‌ను సోమవారం ప్రారంభించారు. చెన్నయ్ షాపింగ్‌మాల్‌కు బ్రాండ్ అంబా సిడర్ అయిన కీర్తిసురేశ్ ఈ కార్యక్రమానికి హాజరై మాల్ ప్రారంభించిన అనంతరం విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం షాపులో కలియతిరిగి అక్కడున్న వస్త్రాలు పరిశీలించారు. షాపింగ్‌మాల్ బయట ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టేజీ మీదకు వచ్చి "హేయ్ కడప.. ఐ లవ్యూ కడప" అంటూ ప్రజలకు విష్ చేశారు. ఆమెను చూడడానికి పెద్ద సంఖ్యలో వచ్చిన అభిమానులు కేరింతలు కొట్టారు. కొంతమంది అభిమానులు డ్యాన్స్ చేయాలని కోరడంతో ఆమె స్టేజీపై డ్యాన్స్ వేసి అలరించారు. కాగా కీర్తిసురేశ్ ను చూసేందుకు అభిమానులు పెద్దఎత్తున అక్కడికి రావడంతో పోలీసులు ముందస్తు జాగ్రత్తగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చెన్నయ్ షాపింగ్‌మాల్ చైర్మన్ మర్రి జనార్ధనరెడ్డి, వైస్‌చైర్మన్ మర్రి వెంకటరెడ్డి, యాజమాన్య ప్రతినిధులు సీఈవో జమునారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నా భార్యకు సంబంధం లేదు

- డీపీవోకు వివరణ ఇచ్చిన సర్పంచ్ భర్త..!



డీపీవో రాజ్యలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ భర్త నారాయణ

చాపాడు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బద్రిపల్లె పంచాయతీ కార్యాలయం పరిధిలో ఆర్థిక అక్రమాలకు సంబంధించి తన భార్యకు సంబంధం లేదని సర్పంచ్ గుత్తి మల్లేశ్వరి భర్త వీరనారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన జిల్లా పంచాయతీ అధికారిణి రాజ్యలక్ష్మికి వినతిపత్రం ఇచ్చారు. ఎంపీడీవో కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా ఉద్యోగం చేసిన హనీఫ్‌బాషా బద్రిపల్లె గ్రామ పంచాయతీకి సంబంధించిన రూ.2.56 లక్షలు దుర్వినియోగం చేశారు. దీంతో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అతన్ని ఉద్యోగం నుంచి తొలగించారు. ఇందుకు సంబంధించి సర్పంచ్ మల్లేశ్వరికి డీపీవో నోటీసులు జారీ చేశారు. సర్పంచ్ చెక్‌పవర్ ఎందుకు రద్దుచేయకూడదో తెలపాలని కోరారు. దీంతో సర్పంచ్ భర్త నారాయణ తన భార్య అయిన మల్లేశ్వరికి ఈ నిధుల దుర్వినియోగంపై ఎలాంటి సంబంధం లేదని డీపీవోకు వివరణ ఇచ్చారు. హనీఫ్‌బాషా ఓటీపీ చెప్పమని అడుగగా మల్లేశ్వరి నంబరు మాత్రమే చెప్పారన్నారు. నిధుల దుర్వినియోగంలో కంప్యూటర్ ఆపరేటర్‌తో పాటు ఈవోపీఆర్‌డీ క్రిష్ణవేణిదే పూర్తి బాధ్యత అని ఆయన చెప్పారు. కాగా నిధుల దుర్వినియోగంపై సంజాయిషీ ఇవ్వాలంటూ సర్పంచ్‌కు డీపీవో నోటీసు ఇవ్వగా.. సర్పంచ్ భర్త సంజాయిషీ ఇవ్వడం విశేషం.

పూత రాలిపోతోంది..



మామిడి చెట్టుకు వచ్చిన పూత

● కొన్ని తోటల్లో ఇప్పటికీ పూతలు రాని వైనం

● ఆందోళనలో మామిడి రైతులు

రైల్వేకోడూరు నియోజకవర్గంలో మామిడి తోటలు విస్తారంగా సాగులో ఉన్నాయి. ఈ ఏడాది మామిడిపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. ఎందుకంటే గత ఏడాది డిసెంబరులో రావాల్సిన పూతలు జనవరి నెలాఖరికి వచ్చాయి. లేటుగా వచ్చినా లేటెస్టుగా అన్నట్లు.. పూత విరబూసింది.. దీంతో దిగుబడి పెరుగుతుందని రైతులు ఆశించారు. ఆ ఆనందం పదిరోజులు కూడా నిలవక ముందే కళ్ల ముందే వచ్చిన పూత వచ్చినట్టే రాలిపోతోంటే రైతులు అయోమయ స్థితిలో పడ్డారు.

రైల్వేకోడూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాదిలో వాతావరణ పరిస్థితులు రైతులకు పెద్దగా అనుకూలించలేదు. గత ఏడాది డిసెంబరులో రావాల్సిన పూతలు జనవరి నెలాఖరికి వచ్చాయి. ఆలస్యంగానైనా పూత విరగబూసింది. దీంతో దిగుబడి పెరుగుతుందని రైతులు ఆశపడ్డారు. కానీ వచ్చిన పూతలు వచ్చినట్టు రాలిపోతోంటే ఆందోళన చెందుతున్నారు. పూత రాలిపోయి కాడలు కనిపిస్తుండటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెట్టిన పెట్టుబడులు లాభాలు చేకూర్చే విధంగా లేవని వాపోతున్నారు. ఎకరాకు ఇప్పటికే దున్నకాలు, కూలీలు, మందులు తదితర వాటికి సుమారుగా రైతులు రూ. 50 వేలు ఖర్చు పెట్టారు. ఒక్క కాడకు పూతంతా పోను పది పిందెలు నిలిస్తే ఆ పిందెలు కూడా పాలిపోయిన రంగులో రాలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. కొన్ని తోటల్లో జీవన ఎరువుల వాడకం చేసినా పెద్ద ఫలితాలు రావడం లేదని రైతులు చెబుతున్నారు. మామిడి సేద్యంలో లాభాల కంటే ఎక్కువగా నష్టాలు వస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రుమాణి, తోతాపూరి, నీలం, రసాలు, కాలేపాడు, రెడ్డిపసందు, నీలిగోవా, బేనీషా, మాల్గోవా, నూనెపసందు, పునాసా, పులిహోరా, అల్లీపసందు, నాటు కాయలు, అతిమధురం, స్వర్ణజంహీర్, ఖాదర్, మల్లికా, పోలూరా తదితర రకాలను రైతులు ఇక్కడ పండిస్తున్నారు. ఈ ఏడాది మొత్తం మీద 15 శాతం దిగుబడులు వచ్చే అవకాశం ఉంది. అదే కాకుండా పూతలు ఆలస్యంగా వచ్చినందు వల్ల ఇతర ప్రాంతాలైన విజయవాడ, చిత్తూరు, తమిళనాడు, కర్ణాటక తదితర ప్రాంతాల్లో ముందుగానే పూతలు వచ్చి కాయలు ఒక్క నెలలో కోతకు వచ్చే అవకాశాలు ఉన్నాయని రైతులు అంటున్నారు. రైల్వేకోడూరు ప్రాంతంలో వచ్చే కాయలకు డిమాండ్ పెరగ వచ్చునని వ్యాపారాలు బేరూజు వేసుకుంటున్నారు. రైల్వేకోడూరు ప్రాంతంలో మామిడి డిమాండ్ ఉన్నప్పటికి ఎక్కువగా కాయలకు మంగు ఏర్పడుతోంది. దీంతో కొంత మేరకు ధరలు తగ్గుతున్నాయి. మంగు రాకుండా ఉండాలంటే వేప నూనె పిచికారి చేయాలని శాస్త్రవేత్తలు రైతులకు సూచిస్తున్నారు. రుమాణి, పునాసా తదితర మామిడి రకాలు గత ఏడాది లో రెండు సార్లు కాపు నిచ్చాయి. దీంతో కాపుకాసిన రైతులకు మంచి లాభాలు వచ్చాయి. నీరు, ఎరువులు, మందులు తదితర వాటిని పద్ధతి ప్రకారం చేస్తే దిగుబడులు వస్తాయని ఉద్యాన శాఖ అధికారులు అంటున్నారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు కూడా పూత రాలిపోవడం జరుగుతోందని రైతులు అంటున్నారు. వీటి అన్నింటికి కారణం వాతావరణంలో మార్పులే కారణం అని రైతులు భావిస్తున్నారు.



ఇప్పటి వరకు మామిడి చెట్లకు రాని పూత

వచ్చిన పూత అంతా మాడిపోయి పది పిందెలు మిగిలిన దృశ్యం



మామిడిపై ఆశలు సన్నగిల్లుతున్నాయి..



మామిడిపై రాను, రాను ఆశలు సన్నగిల్లుతున్నాయి. ప్రతి ఏటా కొమ్మలు కత్తిరింపులు, ఎరువులు, నీరు, కూలీలు, దున్నకాలు తదితర వాటికి ఎకరాకు ఖర్చు రూ. 40 నుంచి రూ. 50 పెట్టాల్సి వస్తోంది. పెట్టుబడి ఎక్కువైంది. రాబడి తగ్గింది. వచ్చిన పూత నిలవడం లేదు. పూతంతా కళ్ల ముందే రాలిపోతోంది. మామిడి లేకుండా వేరే పైర్లు పెట్టుకుంటే మంచి ఆదాయం వస్తుంది.

- మలిశెట్టి మాధవయ్య, వెంకటరాచపల్లె

విరబూసిన మామిడి

వీరబల్లి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): వీరబల్లి బేనీషాకు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉంది. వీరబల్లి బేనీషా బెంగుళూరు, మహారాష్ట్ర, చెన్నై, తమిళనాడు, కేరళ రాష్ట్రాలతో పాటు ఇతర దేశాలకు కూడా ఎగుమతి అవుతుంది. మండలంలో మొత్తం 5040 ఎకరాల్లో మామిడి తోటలు సాగులో ఉన్నాయి. ఈ ఏడాది ఎక్కడ చూసినా పూత కనబడుతోంది. అక్కడక్కడా పిందెలు కనపడుతున్నాయి. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మందుల పిచికారి తగ్గించాలి..



పూత పిందెగా మారడానికి తోటల్లో తేనెటీగలు, ఈగలు ఉండాలి. అవి ఉండాలంటే రసాయనిక మందుల పిచికారి తగ్గించాలి. రెండు రోజులకు నీరందించాలి. పూత పిందెగా మారాలంటే మల్టీకే 10గ్రాములు ఒక గ్రాము ఒక లీటర్ నీటిని కలిపి పిచికారీ చేయాలి. మ్యాంగో స్పెషల్ ఐదు గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. అదేవిధంగా ప్లానోఫిక్స్ అనే హార్మోన్‌ను 0.25 ఎంఎల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

- వనిత, ఉద్యానశాఖ అధికారి



వీరబల్లిలో విరబూసిన మామిడి పూత

పూత ఫుల్.. పిందె నిల్..



సింగనమల వద్ద మెండుగా కనిపిస్తున్న మామిడి పూత

పెనగలూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులను పూత ఊరించి ఉసూరుమనిపించింది. పూత ఫుల్‌గా వచ్చినా పిందెలు మాత్రం మచ్చుకైనా కనిపించలేదు. వాతావరణంలో మార్పులు, అధిక సేంద్రియ ఎరువుల వల్ల కూడా పిందెలు రాకుండా పూత రాలిపోతోందని పలువురు పేర్కొంటున్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మదనపల్లెఅర్బన్, మార్చి 10(ఆంధ్ర జ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. మదనపల్లె పట్టణం, నీరుగట్టువారిపల్లె, గజ్జల కుంటకు చెందిన ఎస్ రాజు (35) స్థానిక టమోటా మండీలో దినసరి కూలీగా పని చేస్తుంటాడు. పదేళ్ల క్రితం భార్యను వదిలేసి, గజ్జల కుంటకు చెందిన మహిళతో సహజీవనం చేస్తున్నాడు. ఆదివారం రాత్రి గొడవ పడి కొట్టడంతో అమె పుట్టినింటికి వెళ్లిపోయింది. కాగా, సోమవారం ఉదయం ఎంతకూ తలుపు తీయకపోవడంతో స్థానికులు కిటికీలోంచి చూడగా ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని కనిపించాడు. వారు అందించిన సమాచారం మేరకు టూటౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పురుగుల మందుతాగి యువకుడు ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన మదనపల్లె మండలం, అంకిశెట్టిపల్లె పంచాయతీలో చోటు చేసుకుంది. తాలుకా పోలీసులు తెలిపిన వివరాల మేరకు సోమవారం కుటుంబ కలహాలతో మదనపనల్లె మండలం, అంకిశెట్టిపల్లె గ్రామం, రామాపురంకు చెందిన శ్రీనివాసులు కుమారుడు నాగేష్(25) పురుగుల మందు తాగి ఆకస్మారక స్థితిలో పడిఉండడంతో స్థానికులు గుర్తించి వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. . తాలూకా సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

లైంగిక దాడి కేసులో ఇద్దరు అరెస్టు

మదనపల్లె అర్బన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): లైంగిక దాడి కేసులో సోమవారం ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మదనపల్లె రూరల్ సీఐ సత్యనారాయణ తెలిపారు. నిమ్మనపల్లె మండలం, తవళం పంచాయతీ, నారాయనివారిపల్లె- నల్లంవారిపల్లెకు మధ్య నారాయణరెడ్డికి చెం దిన వ్యవసాయ బావి వద్ద గత నెల 27న పాలు పోసి ఇంటికి వెళు తున్న ఓ మహిళను నల్లవారిపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు సురేంద్ర(33),రమణ కుమారుడు నాగేంద్ర (23) అడ్డగించి లైంగికదాడి చేయడంతో పాటు, ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించారు. ఈనెల 7న ఆమె ఫిర్యాదు చేయడంతో ఆదివారం నిమ్మన పల్లె మండలం, దిగువపల్లె పంచాయతీ, నిమ్మనపల్లె, మదనపల్లె మెయిన్‌రోడ్డులో హిందూస్తాన్ పెట్రోలియం వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్నామని సీఐ తెలిపారు.

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ల్యాబ్‌ల తనిఖీ

మదనపల్లె అర్బన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం అమరావతి డిప్యూటీ డైరెక్టర్ ఏటీ రామనాథరావు మైక్రోబయాలజీ ల్యాబ్, పీపీ యూనిట్ ల్యాబ్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగీ పరీక్షలను పరిశీలించినట్లు తెలిపారు. ప్రతి జ్వరం కేసును రక్త పరీక్షలు నిర్వహించి వాటి ఫలితాలను ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ హితైషి, షమీమ్, జానకీరామ్, సబ్ యూనిట్ అధికారి ఖలీలుల్లా ఖాన్ పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని త్యాగరాజవీధి ఆరోగ్యకేంద్రంలో వైద్యాధికారులకు, ల్యాబ్ టెక్నీషియన్లకు, సబ్ యూనిట్ సిబ్బందికి సమావేశం ఏర్పాటు చేసి తగు సూచనలు అందించారు.

లారీని ఢీకొన్న ప్రైవేటు స్కూలు బస్సు



కారు చీకటిలో విద్యార్థులు

పుల్లంపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ముందు వెళుతున్న లారీని ఓ ప్రైవేటు స్కూలుకు చెందిన బస్సు ఢీకొంది. వివరాల్లోకి వెళితే రైల్వేకోడూరుకు చెందిన ఓ ప్రైవేటు స్కూల్ బస్సు క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు 60 మందికి పైగా విద్యార్థులతో సోమవారం ఉదయం కడపకు వెళ్లింది. గేమ్స్ ముగిసిన అనంతరం రాత్రి 8 గంటల సమయంలో రైల్వే కోడూరుకు వెళుతుండగా పుల్లంగేరు బ్రిడ్జిపై ముందు వెళుతున్న లారీ అకస్మాత్తుగా స్పీడు తగ్గించడంతో వెనుకనున్న స్కూలు వ్యాను ఢీకొంది. దీంతో బస్సులో ఉన్న విద్యార్థులంతా భయబ్రాంతులకు గురయ్యారు. విషయం తెలుసు కున్న స్థానికులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విద్యార్థు లను బ్రిడ్జిపై నుంచి పక్కకు తీసుకువచ్చారు. బస్సును కూడా తప్పించారు.

చోరీ కేసుల్లో నిందితుడు అరెస్ట్

● 20 తులాల బంగారు, సోనీ కెమెరా స్వాధీనం ● ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, మార్చి10(ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇళ్లలో పగటిపూట చోరీలు చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. సోమ వారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రైల్వేకోడూరు పట్టణంలోని ఓ ఇంట్లో 2024 అక్టోబరు నెల 8 న మధ్యాహ్నం ఓ చోరీ జరిగింది. ఈ కేసుకు సంబంధించి రైల్వే కోడూరు పోలీసులతో కలసి రాయచోటి సీసీఎస్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. తిరుపతి పట్టణంలోని ఓ ఇంట్లో నిందితుడు ఉన్నాడన్న సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం దాడులు నిర్వహించి, అంబేద్కర్ కాలనీ, ఆటోనగర్‌కు చెందిన కచ్చిలేటి రమేశ్ కుమారుడు వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకొని, రూ.17 లక్షల విలువ చేసే 200 గ్రాములు బంగారు నగలతో పాటు ఒక సోనీ ఏ-7 కెమెరాను స్వాధీనం చేసుకున్నారు. అయితే, ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై నడవలేని స్థితిలో ఉన్న నిందితుడు వెంకటేశ్వర్లుకు 35(3) బీఎన్ఎస్ఎస్ యాక్ట్ కింద నోటీసు ఇచ్చామన్నారు. ఇతను ఒక హత్య, హత్యాయత్నంతో పాటు 19 కేసుల్లో నిందితుడుగా ఉన్నాడని తెలిపారు. నిందితుడి అరెస్టుకు కృషి చేసిన రాజంపేట ఏఎస్పీ మనోజ్‌రామ్‌నాథ్ హెగ్డే, సీసీఎస్ సీఐ చంద్రశేఖర్, రైల్వేకోడూరు సీఐ హేమ సుందర్, సీసీఎస్ సిబ్బంది రామకృష్ణారెడ్డి, నవీన్‌తోపాటు కోడూరు పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. మార్కెట్లు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, షాపింగ్ మాల్స్ ,ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఆసుపత్రులు వంటి ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.

జీడితోట దగ్ధం

పెద్దతిప్పసముద్రం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎండుగడ్డికి ఆకతాయిలు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించి జీడితోట అగ్నికి ఆహుతైంది. బాధితుడు సుబ్రమణ్యం అందించిన సమాచారం మేరకు పెద్దతిప్పసముద్రం శివారులోని అంజనేయస్వామి ఆలయానికి సమీపంలోని బీడు భూముల్లో ఉన్న ఎండుగడ్డికి సోమవారం మధ్యాహ్నం ఆకతాయిలు నిప్పంటించారు. ఆ మంటలు పక్కనే ఉన్న జీడి తోటకు వ్యాపించడంతో అందులోని కాపుకొచ్చిన జీడి మొక్కలతోపాటు, మామిడి మొక్కలు, డ్రిప్ పైపులు కాలి బూడిదయ్యాయి. దీంతో సుమారు రూ.50 వేల ఆస్తి అగ్నికి ఆహుతైనట్లు బాధితుడు తెలిపాడు.

రాయచోటి అల్లర్లపై అసెంబ్లీలో చర్చ

● హిందువులపై కేసులు అక్రమం ● బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి

రాయచోటి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా పేరుగాంచిన వీరభద్రస్వామి పార్వేట సందర్భంగా గత మంగళవారం జరిగిన అల్లర్లపై సోమవారం అసెంబ్లీలో చర్చ జరిగింది. కర్నూలు జిల్లా అదోని బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి ఈ అంశంపై సభలో మాట్లాడుతూ 1300 సంవత్సరాల చరిత్ర ఉన్న వీరభద్రస్వామి పార్వేట యాత్ర భక్తుల ఆనందోత్సాహాల మధ్య జరుగుతుంది. ఈ యాత్ర రాయచోటిలోని ఠాణా సర్కిల్‌లోకి రాగానే అక్కడ ఉన్న మసీదులో నుంచి కొందరు అల్లరిమూకలు దాడి చేశాయి. వెంటనే ఆక్కడే ఉన్న పోలీసులు లాఠీచార్జ్ చేసి గుంపును చెదరగొట్టారు. ఊరేగింపులో ఉన్న భక్తుల మీద కూడా లాఠీచార్జ్ చేసి కేసులు పెట్టారు. అల్లరి మూకలు మీద కేవలం గొడవలు చేశారని కేసులు పెట్టారు. హిందూ భక్తుల మీద మాత్రం హత్యాయత్నం చేశారంటూ కేసులు నమోదు చేశారు. అర్బన్ పోలీసుస్టేషన్ ఎస్ఐ నరసింహారెడ్డి ఊరేగింపులో ఉన్న హిందూ భక్తులు జైశ్రీరామ్ అని నినాదాలు చేసినట్లు ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. రాష్ట్రంలో జైశ్రీరామ్ అనడానికి పోలీసుల అనుమతి కావాలా? హోంమంత్రి సమాధానం చెప్పాలి. ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీలకు చెందిన యువకులు పోలీసులు చెప్పినా వినకుండా రెచ్చగొట్టారు అని ఎస్ఐ చెప్పారని, అసలు ఎస్ఐకి ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ అంటే అర్థం తెలుసా.? ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ అంటే దేశం కోసం.. జాతి కోసం, ప్రజల కోసం నిరంతరం నిబద్ధతతో నిరంతరం పనిచేసే దేశ భక్త జాతీయవాద సంస్థలు. వీటి పట్ల చులకనగా ఎఫ్ఐఆర్‌లో పెట్టడం తీవ్రంగా ఖండిస్తున్నాము. దేశ సరిహద్దులో సైనికులు ఉన్నట్లే.. దేశంలో ప్రతి గ్రామంలో ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ కార్యకర్తలు ఉంటారు. వీళ్లను ఇంత చులకనగా చూడడం సరైంది కాదు. అల్లరి మూకల నుంచి హిందూ భక్తులను కాపాడలేని పోలీసులు.. తమ తప్పును కప్పిపుచ్చుకునేందుకు మరెవరినో సంతృప్తి పర్చడానికి మహిళల మీద.. భక్తుల మీద దాడి చేశారు. ఎవరిని బుజ్జగించడానికి హిందువులపైన కఠిన కేసులు పెడుతున్నారు. ఇటువంటి సంఘటనల వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే అవకాశం ఉంది. ఎవరి నాయకత్వంలో అల్లరి మూకలు చెలరేగి పోతున్నాయో విచారించాలి. అటువంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి. హిందూ భక్తుల మనోభావాలను దెబ్బతీసిన ఇటువంటి సంఘటనలపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించాలి అని ఎమ్మెల్యే పార్థసారధి అన్నారు.


బాల్య వివాహం కేసులో ఆరుగురు అరెస్ట్



బాల్య వివాహం కేసు నిందితులను చూపుతున్న ఏఎస్పీ మనోజ్ హెగ్డే

రాజంపేట టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మైనర్ బాలికను వివాహం చేసుకున్న యువకుడు బాలరాజు సురేంద్ర రాజుతో పాటు మరో వ్యక్తిని, నలుగురు మహిళలను అరెస్ట్ చేసినట్లు అడిషనల్ ఎస్పీ మనోజ్ హెగ్డే తెలియజేశారు. సోమవారం ఆయన కార్యాలయంలో నిర్వహించిన విలేక రుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పెనగలూరు మండలం ఈటమాపురం గ్రామానికి చెందిన బాలరాజు సురేంద్రరాజు ఓ మైనర్ బాలిక ను వివాహం చేసుకున్నట్లు ఫిర్యాదు అందడంతో ఐసీడీఎస్ విశాలాక్షి విచారణ చేయగా అతను వివాహం చేసుకున్న యువతి మైనర్ అని, ఆమె ఇప్పుడు ఆమె 8 నెలల గర్భిణి అని తెలిపారు. దీంతో బాల్యవివాహాల నిరోధక చట్టం కింద వారిని రూరల్ సీఐ రమణ, పెనగలూరు ఎస్ఐ బి.రవిప్రకాష్‌రెడ్డి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. బాల్య వివాహాల చట్టం కింద పెళ్లి చేసిన వ్యక్తి, చేసుకున్న వ్యక్తి, పూజారి, పాల్గొన్న ప్రతిఒక్కరు శిక్షార్హులని తెలిపారు.

తప్పుడు కేసులు పెట్టిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి



సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం సమర్పిస్తున్న బీజేపీ, వీహెచ్‌పీ నాయకులు

రాజంపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : రాయచోటి వీరభద్రస్వామి ఉత్సవం సందర్భంగా జరిగిన సంఘటనలో తప్పుడు కేసులు పెట్టిన ఎస్ఐ, సీఐలపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ నాయకులు రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనివాసులునాయుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు తదితరులు సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయచోటి సంఘటనలో నిజా నిజాలు గ్రహించకుండా ఎటువంటి తప్పు చేయని వారిపై కేసులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. పవిత్ర ఉత్సవాన్ని మరో వర్గంవారు అడ్డుకోవడం తగదన్నారు. అడ్డుకున్న వారిపై కేసులు నమోదు చేయకుండా దేవుడి కార్యక్రమంలో పాల్గొన్న వారిపై కేసులు నమోదు చేయడం తగదన్నారు. దీనిపై పోలీసులు సమగ్ర విచారణ చేసి చర్యలు చేపట్టాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు పెంచల్‌రెడ్డి, పెంచల్‌రాజు, నాగేశ్వరరావు, ఆదినారాయణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బూర్లపల్లె వాసి దుర్మరణం




రవితేజ (పైల్ ఫొటో)

పెద్దతిప్పసముద్రం మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం హోసకోట సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో బూర్లపల్లెకు చెందిన ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. కుటుంబీకులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎం. సుధాకర్ కుమారుడు రవితేజ (25) బెంగళూరులో ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు ఆదివారం తన స్నేహితులతో కలిసి కారులో గ్రామానికి వచ్చాడు. సోమవారం వేకువజామున కారులో బెంగళూరుకు బయలుదేరి వెళుతుండగా హోసకోట సమీపంలో వారు ప్రయాణిస్తున్న కారు డివైడర్‌ను ఢీకొంది. ర ఈ ప్రమాదంలో రవితేజ (25) అక్కడికక్కడే మృతి చెందాడు. స్నేహితుల్లో ఒక్కరికి గాయాలు కాగా, మరో వ్యక్తి పరారయ్యాడు. కర్ణాటక పోలీసులు మృతదేహాన్ని హోసకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని కుటుం బ సభ్యులు తెలిపారు.

'ముస్లింలకు సబ్‌ప్లాన్ నిధులు' ఘనత చంద్రబాబుదే..

ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



మాట్లాడుతున్న షాజహాన్ బాషా

మదనపల్లెటౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ముస్లింల ఆర్థికాభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వం సబ్‌ప్లాన్ నిధులు కేటాయించిందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. సోమవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ మైనారిటీలు పేరుకే నవాబులు, జాగీర్దార్లుగా ఉన్నారు. కానీ వారి వార్షిక ఆదాయం రూ.2లక్షలకు మించడం లేదన్నారు. అటువంటి మైనారిటీల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు రూ.5,434 కోట్లు మంజూరు చేశారన్నారు. మైనారిటి సబ్‌ప్లాన్ కోసం రూ. 2,512 కోట్లు మంజూరు చేశారన్నారు. జగన్ పాలనలో మైనారిటీలకు అన్యాయం చేశారన్నారు. మదనపల్లెలో రూ.2వేల కోట్ల విలువైన వక్ఫ్ భూములను కాపాడనన్నారు. చిత్తూరు, పుంగనూరు, పలమనేరు ప్రాంతాల్లో వక్ఫ్ భూములను ప్రభుత్వం కాపాడాలన్నారు. మైనారిటీ విద్యార్థుల విదేశీ విద్య కోసం రూ.10 లక్షల చొప్పున చంద్రబాబు కేటాయించారని గుర్తుచేశారు. ఇమామ్, మౌజన్‌ల జీతాలను ఒకే సంతకంతో రూ.45 కోట్లు విడుదల చేసిన ఘన త చంద్రబాబుకే దక్కిందన్నారు. హజ్‌యాత్ర కోసం నిధులు సమకూర్చారని, ఉర్దూ అకాడమీ, మైనారిటీ కార్పొరేషన్ కోసం, నిధులు కేటాయించారన్నారు. క్రిస్టియన్ మైనారిటీల కోసం కూడా కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు.

బైక్ ఢీకొని వృద్ధుడు మృతి




వృద్ధుడి మృతదేహం

ములకలచెరువు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన సోమవారం ములకలచెరువు వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు..శ్రీ సత్యసాయి జిల్లా తకనల్లు మండలం చీకటిమానిపల్లెకు చెందిన ఆదినారాయణ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతనికి భార్య ఉత్తమ్మ, కుమారుడు శివకృష్ణ ఉన్నాడు. కూలి పనుల నిమిత్తం ములకలచెరువుకు వచ్చాడు. సోమవారం స్థానిక షాదీమహల్ వద్ద ముంబాయి - చెన్నై జాతీయ రహదారి దాటుతుండగా మదనపల్లె నుంచి కదిరి వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన అతనిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. పోలీసులు కేసుదర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నాళ్లీ... వివక్ష
ఆడపిల్లలకేదీ..రక్ష

● ప్రతి 1000 మంది బాలురకు 925 మందే బాలికలు

● జననాల రేటు 1.78కి పడిపోయిన వైనం



కడప కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): శాస్త్ర సాంకేతిక రంగాలు పరిఢవిల్లుతున్న సమయంలోనూ ఆడపిల్లలపై వివక్ష తప్పడం లేదు. పురుషులకు ధీటుగా అన్ని రంగాల్లో మహిళలు సత్తా చాటుతున్నప్పటికీ ఆడపిల్లల పుట్టుకను స్వాగతించలేని దౌర్భాగ్య పరిస్థితి. ఆడపిల్లల పుట్టక ఆర్థిక భారమనే భావనతో మొగ్గ దశలో చిదిమేస్తున్నారనే వాదన వినిపిస్తోంది. ఇందుకు ప్రధానంగా స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ పరీక్షలు.. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపీలు అబార్షన్లు చేస్తూ ఆడపిల్ల పుట్టుకను అడ్డంకుంటున్నారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీనిపై వైద్యశాఖ ఎటూ తేల్చలేకుంది. ప్రతి 1000 మంది బాలురకు ధీటుగా 1000 మంది ఆడపిల్లలు ఉండాలన్నదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం. ఆ లక్ష్యం నేరవేర్చే క్రమంలో వైద్యశాఖ, ఐసీడీఎస్, స్వచ్ఛంధ సంస్థలు, పోలీసు, రెవె న్యూ శాఖలు ఆడపిల్లలను రక్షించుకునేందుకు పీసీ అండ్ పీఎన్డీటీ యాక్ట్ సమావేశాలతో నిరంతరం కాపు కాస్తున్నాయి. కానీ ఆడపిల్లల శాతం ఎక్కడ తగ్గుతోందో లెక్కలు తేల్చలేని పరిస్థితి.

జిల్లాలో పరిస్థితులు చూస్తే ప్రతి 1000 మంది పురుషులకు 925 మంది మహిళలు ఉన్నారు. ఇదీ ఈ నాటి లెక్కకానే కాదు. 2001 నుంచి 2024 వరకు జరిగిన సెన్సస్‌ను పరిశీలిస్తే ఆడపిల్లల శాతం పెరుగుదల శూన్యమనే చెప్పాలి. మరో పక్క జిల్లాలో ఆడపిల్లల జననాలు తగ్గుతున్నాయనే విషయం కేంద్రం గుర్తించింది. 2015 లోనే మోదీ సర్కారు ఆడపిల్లలను బతికిద్దాం... చదివిద్దాం అనే నినాదంతో బాలికా సంరక్షణకు పాటుపడుతున్నా బాలికల శాతం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉండడం శోచనీయం. వైద్యశాఖ లెక్కల్లో ఆడపిల్లలతో పాటు జననాలు కూడా తగ్గుతుండడం ప్రభుత్వాలను కలవరపడుతున్నాయి. సగటు కుటుంబంలో ఇద్దరు బిడ్డలకు తక్కువ కాకూడదనే లెక్కలు తారుమారై జననాల రేటు కూడా 1.78 శాతంకి పడిపోయింది. ఇది కూడా ఆడపిల్లల శాతం తగ్గడానికి కారణాలంటున్నారు.

అవగాహన పెరగాలి

ఆడపిల్లల శాతం పెంచడం అందరీ బాధ్యత. ఒక్క వైద్యశాఖతో లక్ష్యాలు సాధించడం కష్టం. ఆడపిల్లల తల్లిదండ్రులను ఫెసిలిటీ ప్రోగ్రామ్ ద్వారా సత్కరిస్తున్నాం. ఆడ మగ సమానమనే విష యంపై ప్రజల్లో అవగాహన పెరగాల్సి ఉంది. లేట్ మ్యారేజీల వల్ల కూడా జననాల వృద్ధి రేటు జిల్లాలో పడిపోయింది. సగటు కుటు ంబంలో ఇద్దరు ఉండాల్సిన బిడ్డలు ఇప్పుడు 1.78కు పడిపోయింది. గర్భంలో పిండం పడిన నాటి నుంచి కాన్పు అయ్యేంత వరకు ప్రభుత్వం అన్ని వైద్య సేవలు ఉచితంగా అందిస్తుంది. ఆర్థిక సాయంతో పాటు తల్లీ బిడ్డ సంరక్షణ బాధ్యతను భరిస్తోం ది. గర్భిణులు కాన్పులు ప్రభుత్వాసుపత్రుల్లో చేసుకోవాలి.

-డాక్టర్ నాగరాజు, డీఎంహెచ్ఓ

ఆర్ఎంపీల నిర్వాకంతో...

ప్రథమ చికిత్స కేంద్రాల ఆర్ఎంపీలు పల్లె వైద్యంలో పాతుకు పోయారు. జిల్లాలోని 51 పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రుల్లో వైద్యుల సంఖ్య 200కు మించదు. కానీ ఆర్ఎంపీలు మాత్రం సందుకొక ప్రథమ చికిత్స కేంద్రం నిర్వహిస్తూ.. కాన్పులు, అబార్షన్లు చేసేంత వరకు ఎదిగి పోయారు. వీరి నిర్వాకంతో ఆడపిల్లల జనభాకు కత్తెర పడుతోందనే విమర్శలున్నాయి. దీంతో జిల్లాలో మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో జరిగే జననాలతో పాటు ఆడపిల్లల పుట్టుకలు గణాంకాల్లో నమోదు జరగడం లేదనే వాదన ఉంది. ఇటీవల అక్కాయపల్లిలో ఓ ఆర్ఎంపీ అబార్షన్లు చేస్తున్న నిర్వాకం గుట్టురట్టయ్యింది.

డెకాయి కేసులు నామమాత్రమే...

జిల్లాలో ఆడపిల్లలు తగ్గుతున్నారంటూ గగ్గోలు పెట్టే వైద్యశాఖ స్కానింగ్ సెంటర్లపై పెద్దగా నిఘా పెట్టడం లేదనే విమర్శలు ఉన్నాయి. దశాబ్దకాలం కిందట లింగనిర్ధారణ పరీక్షల్లో ఉమ్మడి జిల్లాలోని సరిహద్దు ప్రాంతాల్లో ఉండే స్కానింగ్ సెంటర్లు పదో పరకకో ఆశపడి ఆడపిల్ల పుట్టుకను అడ్డుకున్నారనేది నగ్నసత్యం. ఇపుడు జిల్లాలో 157 స్కానింగ్ సెంటర్లు ఉన్నా వాటిపై తనిఖీలన్నీ మొక్కుబడే అంటారు. తాజాగా అన్నమయ్య ప్రకాశం జిల్లాలో లింగ నిర్ధారణ చేస్తున్న స్కానింగ్ సెంటర్లపై డెకాయి ఆపరేషన్లు చేసి సెంటర్లను సీజ్ చేసి అక్కడి అధికారులు కేసులు పెట్టారు. మన జిల్లాలో డెకాయి ఆపరేషన్లు నెలకు 5-10 సెంటర్లలో చేయడమే తప్ప ఏళ్లు గడుస్తున్నా ఒక్కటంటే ఒక్క కేసు నమోదు కాలేదు. దీనిపై ఉన్నతాధికారులు వైద్యశాఖను ప్రక్షాళన చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనాఉంది.

ప్రజా సమస్యలకు ప్రాధాన్యమివ్వాలి : జేసీ



ప్రజల వద్ద నుంచి వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తుందన్నారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా తంబళ్లపల్లి మండలానికి చెందిన నాగరాజునాయక్ తాను వికలాంగుడినని మూడు చక్రాల ఎలక్ట్రిక్ స్కూటర్‌ను మంజూరు చేయాలని, రాయచోటి మండలానికి చెందిన అబ్దుల్ సత్తార్ రైతు భరోసా నగదు అందడం లేదని, శేషాద్రినాయుడు తనకు ఇంటి స్థలం మంజూరు చేయాలని విన్నవించుకున్నారు. కార్యక్రమంలో డీఆర్వో మధుసూదన్‌రావు, ఎస్‌డీసీ రమాదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

న్యాయం జరిగేలా భరోసా కల్పించండి



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటి టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులపై చట్ట పరిధిలో బాధితులకు న్యాయం జరిగేలా భరోసా కల్పించాలని జిల్లాలోని పోలీసు అధికారులను ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించిన ఎస్పీ అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. బాధితుల సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని, బాధితులకు చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకుని తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. ఫిర్యాదులను స్వీకరించడంలో పోలీసులు ఎటువంటి జాప్యం చేయకూడదని, దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు త్వరగా న్యాయం జరిగేలా చూడాలని తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేని బాధితులు వారి పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లో గానీ, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చునని ఎస్పీ సూచించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

సీకేదిన్నె, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కింద పడి వెన్నముక దెబ్బతినడంతో ఓ మహిళ తీవ్ర మనస్థాపానికి గురై విష ద్రావణం తాగి ఆత్మ హతాయత్నానికి పాల్పడింది. ఆమె చికిత్స పొందు తూ సోమవారం మృతి చెందింది. ఎస్ఐ కొండారెడ్డి వివరాల మేరకు... మండలంలోని గోపాలపురానికి చెందిన గజ్జెల నారాయణరెడ్డి భార్య గజ్జెల యశోద కిందపడటంతో వెన్నముక దెబ్బతింది. దీంతో ఆమెకు కడపలోని ఓ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించారు. అనంతరం ఆమె నొప్పి భరించలేక బాధపడుతూ ఉండేది. దీంతో మనస్థాపానికి గురైన ఈనెల 8వ తేదీ రాత్రి విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గుర్తించిన కుటుంబ సభ్యులు కడపలో చికిత్స అందించగా కోలుకోకపోవడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలు కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఆమె కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దారి విషయమై ఘర్షణ..
నిమ్మచెట్ల నరికివేత



దారికి అడ్డంగా వేసిన మట్టికట్ట

పెండ్లిమర్రి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పరాజుపల్లె గ్రామానికి చెందిన అన్నదమ్ముల మధ్య దారి విషయమై సోమవారం ఘర్షణ పడి నిమ్మచెట్లను నరికివేశారు. వివరాల్లోకి వెళితే.. నందిమండలం రెవిన్యూ పొలంలో గంగిరెడ్డి, మనోహర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి అనే ముగ్గురు అన్నదమ్ములకు తల్లిదండ్రుల నుంచి వచ్చిన ఆస్తి ఉంది. ఈ పొలంలో దారి విషయమై గొడవపడి మనోహర్‌రెడ్డికి చెందిన వ్యవసాయ పొలంలో సాగులో ఉన్న నిమ్మ, వేపచెట్లను తన ఇద్దరు అన్నదమ్ములు నరికి వేశారని, అలాగే నన్ను, నా భార్యను నానా దుర్భాషలాడి కొట్టారని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ మధుసూదన్ రెడ్డి పరిశీలించి.. కేసు నమోదు చేసి విచారణ చేస్తునట్లు తెలిపారు.

వ్యవసాయ మోటర్ల వైర్లు చోరీ

చెన్నూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బలసింగాయపల్లె పరిధి లోని కైలాసగిరికోనకు వెళ్లే దారిలో వ్యవసాయ మోటర్లకు సంబంధించిన వైర్లను ఆదివారం రాత్రి దొంగలు చోరీ చేశారు. దీని విలువ రూ.25వేల వరకు ఉంటుందని మోటర్ల యజమానులు లేవాకు రాము, లేవాకు రవి తెలిపారు. పంట చేతికొచ్చే సమయంలో వైర్లు చోరీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

గజ వాహనంపై
లక్ష్మీనరసింహుడు

● వైభవంగా ఊంజల్ సేవ



గజవాహనంపై కొలువుదీరిన లక్ష్మీనరసింహుడు

గుర్రంకొండ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తరిగొండలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారు గజ వాహనంపై భక్తులను కరుణించారు. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉదయాన్నే స్వామి వారిని మేల్కొలిపి ఆలయశుద్ధి, తోమాల సేవ, అర్చన, పంచామృతాలతో అభిషేకాల అనంతరం ఉత్సవ మూర్తులను తిరుచ్చి వాహనంలో ఉంచి గ్రామంలో ఊరేగించారు. సాయంత్రం స్వామి వారికి ఊంజల్ సేవను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి స్వామి వారు గజవాహనంపై భక్తులకు దర్శమిచ్చారు. గజవాహనంపై ఆశీనులైన స్వామి వారు పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. స్వామి వారిని దర్శించుకోవడానికి చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధికంగా వచ్చారు. స్వామి వారి వాహనం ముందు మహిళలు దీలు మోసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

నేడు కల్యాణోత్సవం....

నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి స్వామి వారి కల్యాణోత్సవాన్ని టీటీడీ వేద పండితులు కన్నులపండువలా నిర్వహించనున్నారు. అనంతరం విశేష అలంకరుడైన స్వామి వారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

బాలుడి హత్యకేసుపై సీఐడీ విచారణ



వెంగళాయపల్లెలో ప్రజలను విచారిస్తున్న సీఐడీ ఎస్పీ చక్రవర్తి

ప్రొద్దుటూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాజుపాళెం మండలం వెంగళాయపల్లెలో 2021లో హత్యకు గురైన తనుష్‌రెడ్డి అనే బాలుడి హత్య కేసుకు సంబంధించి సీఐడీ ఎస్పీ చక్రవర్తి ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఈ హత్యకేసులో అప్పటి పోలీసులు కేవలం సైదుగాళ్ల పెద్ద దస్తగిరి అనే ఒక వ్యక్తిని అరెస్టు చేసి కేసు నుంచి అసలు సూత్ర దారులను తప్పించి తమ కుటుంబానికి పోలీసులు అన్యాయం చేశారని బాలుడి తండ్రి సంజీవరెడ్డి సీఐడీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం వెంగళాయపల్లెలో బాలుడి హత్యకు సంబంధించి గ్రామ ప్రజలను సీఐడీ అధికారులు బహిరంగంగా విచారించారు. అదృశ్యమైన బాలుడి శవం బయటపడ్డ బావి పరసరాలను ఎస్పీ చక్రవర్తి స్వయంగా పరిశీలించారు. పోలీసుస్టేషన్‌లో రికార్డు లను తనిఖీ చేశారు. అలాగే బాలుడు అదృశ్యమైన దగ్గరి నుంచి బావిలో శవమైతేలిన వరకు జరిగిన ఘటనలను తనుష్‌రెడ్డి తండ్రి సంజీవరెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

ఈవిచారణకు ఎస్పీ చక్రవర్తితో పాటు సీఐ డీ డీఎస్పీ రసూల్ సాహెబ్, సీఐ రంగస్వామి, ప్రొద్దుటూరు డీఎస్పీ భావన, రూరల్ సీఐ మద్దిలేటి, రాజుపాళెం ఎస్ఐ కత్తి వెంకట రమణలు ఉన్నారు.

ఖాజీపేటలో
పేలనున్న ఐపీ బాంబు?

● రూ.కోటికి పైగా అప్పులు చేసి పరార్

ఖాజీపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఖాజీపేటలో ఓ దుకాణదారుడు మాయమాటలతో జనాన్ని మోసం చేసి కోటికిపైగా అప్పులు చేసి పారిపోయినట్లు తెలుస్తోంది. ఖాజీపేట పాత బ్యాంకు పక్కన మూడు సంవత్సరాల క్రితం అనంతపురం జిల్లా నుంచి వచ్చిన ఓ వ్యక్తి కిరాణా దుకాణాన్ని పెట్టి వ్యాపారం చేస్తుండేవాడు. ఈ నేపథ్యంలో అతను ఇక్కడే పెళ్లి కూడా చేసుకున్నాడు. అతడు అందరికీ నమ్మకంగా ఉండటంతో వ్యాపారానికి డబ్బులు కావాలని అడగగానే చాలామంది డబ్బులు ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో ఆ వ్యక్తి రెండు సంవత్సరాల్లో కోటికిపైగా అప్పు చేసినట్లు తెలుస్తోంది. నాలుగు రోజులుగా దుకాణం తెరవకపోవడంతో పాటు సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేయడంతో రుణదాతలు ఐపీ భయంతో భయపడుతూ ఈ విషయంపై చర్చించుకుంటున్నారు. అప్పులు తీసుకున్న వారికి అధిక వడ్డీ ఇస్తుండటంతో కొంతమంది మోసపోయారు. కొన్ని సంవత్సరాల క్రితం ఇక్కడే వేరే జిల్లాకు చెందిన వ్యక్తి ఐపీ పెట్టి పారిపోవడంతో ప్రస్తుతం అలాగే జరుగుతుందేమోనన్న ఆందోళనలో అప్పులు ఇచ్చిన వారు ఉన్నారు.

మార్చి 31 వరకు కేసీకి నీటిని విడుదల చేయాలి

చాపాడు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కేసీ కెనాల్, చాపాడు కాలువలకు ఈనెల 31 వరకు సాగునీటిని విడుదల చేయాలని కేసీకెనాల్ ప్రాజెక్టు కమిటీ వైస్‌ఛైర్మన్ ద్వార్షల గురివిరెడ్డి అధికారులను కోరారు. కేసీకెనాల్ నంద్యాల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ప్రతాప్‌కు సోమవారం ఆయన వినతి పత్రం పంపించారు. కేసీకెనాల్‌కు ఉపకాలువలు అయిన చాపాడుచానెల్, ఏటూరు కాలువ, కొండపేట కాలువల పరిధిలో సాగు చేసిన వరి, పసుపు, మిరప, మినుము, ఇతర పైర్లు ఎండిపోతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం అవి కోత దశలో ఉన్నాయన్నారు. జిల్లాలోని 13 చెరువులకు కూడా నీటిని నింపాల్సిన అవసరం ఉందన్నారు.

నిద్రావస్థలో...
నిఘా నేత్రాలు

● కడప నగరంలో పనిచేయని సీసీ కెమెరాలు

● ఏర్పాటుకు పోలీసుల కసరత్తు



వన్‌టౌన్ సర్కిల్‌లో గతంలో పోలీసులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

కడప క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం.. నేరాలు అదుపు, నిందితుల వేటలో నిఘా నేత్రాలది కీలకపాత్ర. అలాంటి సీసీ కెమెరాలు ప్రస్తుతం నగరంలో నిద్రావస్థలో ఉన్నాయి. ఫలితంగా నేరాలు జరిగినప్పుడు పోలీసులు నిందితులను గుర్తించలేకపోతున్నారు. వివరాలిలా...

కడప నగరంలో 2017లో కమాండెంట్ కంట్రోల్ వ్యవస్థ ఏర్పాటు చేసి 270కి పైగా కెమెరాలను ఏర్పాటు చేసి వాటిని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పైనున్న మానిటర్ ద్వారా పర్యవేక్షిస్తుండేవారు. ఏదైనా చిన్న చిన్న సమస్య జరిగినా నిమిషాల్లో అక్కడకి బ్లూకోల్ట్ సిబ్బందిని పంపించి నేరాలు అదుపు చేసేందుకు ఈ కెమెరాలు ఎంతో ఉపయోగపడ్డాయి. అలాగే చోరీ కేసులు, ఘర్షణలు, రోడ్డు ప్రమాదాలు వంటి కేసులను సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా పోలీసులు ఛేదించారు. అయితే గతంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా నగరంలో ఉన్న సీసీ కెమెరాలను తొలగించారు. ఇప్పుడు వాటిని ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం నగరంలో ప్రధాన సర్కిళ్లతో పాటు సమస్యాత్మక ప్రాంతా లు, చైన్‌స్నాచింగ్ లాంటి ఘటనలు జరిగే ప్రాంతాలను గుర్తించి 400కు పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు పోలీసులు కసరత్తు చేస్తున్నారు.

కడప నగరంలో 275కు పైగా కెమెరాలు పనిచేస్తుండేవి. ప్రస్తుతం 13 మాత్రమే పనిచేస్తున్నాయి. అవి కూడా కొన్ని సర్కిళ్లతో పాటు రోడ్డు విస్తరణ జరగని ప్రాంతాల్లోనే ఈ సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయి. ఇర్కాన్ సర్కిల్ నుంచి సాక్షి సర్కిల్, సాక్షి సర్కిల్ నుంచి ఊటుకూరు సర్కిల్, ఊటుకూరు సర్కిల్ నుంచి బీపీసీ సర్కిల్ మీదుగా నగరంలోని అన్ని ప్రధాన కూడళ్లలో ఈ సీసీ కెమెరాల వ్యవస్థను ఏర్పాటు చేసి మొత్తం కేబుల్ కనెక్షన్ ద్వారా వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేసి అక్కడ మానిటరింగ్ ద్వారా పర్యవేక్షిస్తూ వస్తున్నారు. అయితే రోడ్డు విస్తరణలో భాగంగా గతంలో సీసీ కెమెరాలకు ఉన్న కేబుల్ వైర్లు కట్ చేశారు. దీంతో సీసీ కెమెరాల కంటే కేబుల్ ఖర్చు ఎక్కువ వస్తుంది. దీంతో పోలీసులు దాతల సహకారంతో పునఃనిర్మించేందుకు చర్యలు చేపడుతున్నారు.



వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో సీసీ ఫుటేజీల మానిటరింగ్ సిస్టం

400 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నాం

కడప నగరంతో పాటు నేర నియంత్రణ కోసం ప్రధాన జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి 400 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సీసీ కెమెరాల విషయమై ఎస్పీ అశోక్‌కుమార్ నగర కమిషనర్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లాం. ఆయన కూడా సానుకూలంగా స్పందించారని.. త్వరలో అందరి సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం.

-వెంకటేశ్వర్లు, కడప డీఎస్పీ

నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరు




కడప...ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న అంగన్వాడీలు, వేంపల్లె తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

కడప సెవెన్‌రోడ్స్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని తలపెట్టిన ఆందోళన సందర్భంగా జిల్లాలో అంగన్వాడీ వర్కర్లు, లీడర్స్‌ను హౌస్ అరెస్టు చేయడం, నిర్బంధించడం సరైంది కాదని సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు బి.మనోహర్, నాగసుబ్బారెడ్డి ఆర్డీఓ ఆఫీస్ ముట్టడి కార్యక్రమంలో తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన చేయడానికి విజయవాడ అలంకార్ వద్ద ప్రభుత్వం పర్మిషన్ ఇచ్చిందని గుర్తుచేశారు. అయిన ప్పటికీ జిల్లాలో అంగన్వాడీ వర్కర్స్‌ను పోలీసులు ద్వారా అరెస్టుచేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అంగన్వాడీ వర్కర్స్‌కు ఏం జరిగిన ప్రభుత్వానిదే బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణచారి, జిల్లా నాయకులు రామ్మోహన్, ఏపీరైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి, నాయకులు నాగేంద్ర పాల్గొన్నారు.

కమలాపురం రూరల్..: అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏరియా కార్యదర్శి రాణి, సీపీఐ కమలాపురం ఏరియా సహాయకార్యదర్శి నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లు తలపెట్టిన చలో విజయవాడ మహాధర్నాకు రైళ్లలో, బస్సుల్లోవెళుతున్న అంగన్వాడీలను ఎక్కడిపడితే అర్ధరాత్రి అని తేడా లేకుండా ఎక్కడబడితే అక్కడ అరెస్టులు చేయడం దుర్మార్గమని అరెస్టు చేసిన వారిని వదిలి పెట్టాల న్నారు. దీనిపై సోమవారం కమలాపురం తహసీల్దారు కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహసీల్దారు శివరామిరెడ్డికి వినతిపత్రం అందించారు.ఈ ధర్నాలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు లక్ష్మీదేవి, అరుణ, యశోద పాల్గొన్నారు.

వేంపల్లె..: వేంపల్లె మండలంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు ధర్నాకు దిగారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. కనీసం రూ.26వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. చలో విజయవాడ కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేయడం, దుర్మార్గమైన చర్య అని అంగన్వాడీలు నినదించారు.ధర్నా అనంతరం తహసీల్దార్ హరినాథ్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.

మెగా డీఎస్సీ పరీక్షలకు ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ పరీక్షలకు ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్ష ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ సంచాలకుడు ఎం.భరత్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. టెట్‌లో ఉత్తీర్ణత సాధించి జిల్లాకు చెందిన వారికి మాత్రమే ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఈనెల 10వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరించనున్నామని పేర్కొన్నారు. టెట్‌లో అర్హత సాధించిన మార్కుల పత్రాన్ని, కుల, ఆదాయ, స్థానిక ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టుసైజు ఫోటోలు జతచేసి ఆంధ్రప్రదేశ్ బీసీస్టడీ సర్కిల్, ఓల్డ్ రిమ్స్, బీసీ భవన్ రెండవ అంతస్తు, కడప కార్యాలయంలో అందజేయాలని కోరారు. దరఖాస్తు పత్రాలు కూడా ఈ కార్యాలయం నుంచే పొందాలని సూచించారు. వివరాలకు నేరుగా కార్యాలయంలో గాని, 9849919221, 9966418572 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పొలంలోకి దూసుకెళ్లిన వాహనం

లింగాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్నపల్లె వద్ద ఆదివారం అర్ధరాత్రి స్కార్పియో వాహనం అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో అనంతపురం జిల్లా తాడిమర్రి మండలం తురకవానిపల్లె గ్రామానికి చెందిన రమేష్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి.వాహనంలో ఉన్న మరోవ్యక్తికి స్వల్పగాయాల య్యాయి. రమేష్ అనే వ్యక్తిని చికిత్స కోసం అనంతపురం తరలించగా మెరుగైన చికిత్స కోసం బంధువులు బెంగళూరుకు తరలించినట్లు తెలిసింది.

పంట నమోదు జాబితా

వీరపునాయునిపల్లె, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రబీ 2024-25 సీజన్‌లో రైతులు సాగుచేసిన పంటల నమోదు జాబితాను మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు ఏవో శ్యామ్‌బాబు తెలిపారు. మండల వ్యాప్తంగా 6671 మంది రైతులు 25410 ఎకరాలలో పంటలు సాగుచేశారని తెలిపారు. జాబితాలో ఏవైన అభ్యంతరాలు ఉంటే ఈనెల 12లోపు తెలియజేయాలని సూచించారు. పొరపాట్లు ఉంటే రైతులు రాతపూర్వకంగా తెలియజేయాలని కోరారు.అలాగే రైతులందరూ విశిష్ట గుర్తింపు సంఖ్యకునమోదు చేసుకోవాలని కోరారు.

సీసీరోడ్డుకు భూమిపూజ



కడప ఎర్రముక్కపల్లె, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కడప నగరం 41 డివిజన్‌లో రూ.50లక్షలతో సీసీరోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి భూమిపూజ నిర్వహించారు. కార్పొరేషన్ పరిధిలో ప్రతి డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మనోజ్‌రెడ్డి, కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, టీడీపీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

ఎయిమ్స్ ఒలంపియాడ్ హంట్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ



మెడల్స్ అందుకుంటున్న విద్యార్థులు

సింహాద్రిపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎయిమ్స్ ఒలంపియాడ్ ఆధ్వర్యంలో కడపలో నిర్వహించిన పోటీ పరీక్షలలో సింహాద్రిపురం శ్రీ వివేకానంద స్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనపరచి విజేతలుగా నిలిచారు. విజేతలుగా నిలిచి జాతీయ స్థాయిలో 8వ ర్యాంక్ సాధించిన ఎస్. హిమజ, రాష్ట్ర స్థాయిలో 10వ ర్యాంక్ సాధించిన ఆర్. జస్మిత్‌రెడ్డి, జోనల్ స్థాయిలో 1వ ర్యాంక్ సాధించిన కె. మహమ్మద్ సజనకు హైదరాబాద్ రవీంద్రభారతి ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో వారికి మెడల్స్, మెమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఖాదర్‌వలి, డైరెక్టర్ జాఫర్, హెచ్‌ఎం శహనాజ్‌బేగం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విజేతలను అభినందించారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు కనీస పెన్షన్ ఇవ్వాలి

కడప మారుతీనగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల బతుకులు దయనీయంగా వున్నాయని కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈ.పి.ఎఫ్) ద్వారా నెల వారి పెన్షన్ రూపంలో 1,000, 1,400 2,000, రూపాయలు మాత్రమే అందుతున్నాయని దీంతో చాలా ఇబ్బంది పడుతున్నామని ఆర్టీసీ విశ్రాం ఉద్యోగుల సంఘం రీజనల్ కార్యదర్శి వై.రవీంద్రనాథ్‌వర్మ ఆవేదన వ్యక్తం చేశారు. కనీస పెన్షన్‌గా రూ. 7,500 రూపాయలైనా వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఆ మేరకు ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం కడప రీజనల్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు సోమశేఖర్‌రెడ్డి, రాజారెడ్డి, సుమారు 100 మంది విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

పెండింగు కేసులను వెంటనే పరిష్కరించండి



మాట్లాడుతున్న డీఎస్పీ మురళి

పులివెందుల టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి):పోలీసుస్టేషన్ పరిధిలోని పెండింగు కేసులను వెంటనే పరిష్కరించాలని పులివెందుల డీఎస్పీ మురళీ అన్నారు. సోమవారం పట్టణ పరిధిలోని డీఎస్పీ కార్యాలయంలో ఆయన పరిధిలోని పోలీసు స్టేషన్లకు సంబంధించిన ఎస్‌ఐలు, సీఐలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుస్టేషన్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయసంఘటనలు జరగకుండా ప్రత్యేకంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పులివెందుల సబ్ డివిజను పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కడపలో తెలుగు సంస్కృతి అకాడమీ ఏర్పాటుచేయాలి

కడప కల్చరల్ మార్చి 10, (ఆంధ్ర జ్యోతి): జిల్లా కేంద్రమైన కడపలో మహా కవయిత్రి మొల్ల పేరుతో తెలుగు సంస్కృతి అకాడమీ ఏర్పాటు చేయాలని మొల్ల సాహిత్య పీఠం అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు ప్రభుత్వాన్ని కోరారు. మొల్ల జయంతి ఉత్సవాల్లో భాగంగా 7వ రోజున సోమవారం ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కా ర్యాలయంలో సాహితీ సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు, వైవీయూ రిజిస్ట్రారు ఆచార్య పుత్తా పద్మ హాజరై మాట్లాడారు. జిల్లారచయితల సంఘం అధ్యక్షకార్యదర్శులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, జింకా సుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, సాహిత్య పీఠంఉపాధ్యక్షుడు మల్లయ్య, నాగమునిరెడ్డి, స్వర్ణలత పాల్గొన్నారు.

ప్రారంభమైన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు




పూజలు చేస్తున్న పుత్తా కుటుంబీకులు

వల్లూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాచిరెడ్డి పల్లెలో లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా వేడుకగా ప్రారంభయ్యాయి. ముందుగా పుత్తా నరసింహారెడ్డి స్వగృహంలో ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి దంపతులు, పుత్తా సోదరుడు రామ చంద్రారెడ్డి దంపతులు తన ఇంటిలో గణపతిపూజ నిర్వహించిన అనంతరం పూజా సామగ్రిని మేళతాళాలతో నరసింహస్వామి దేవాలయం వద్దకు తీసుకుని వచ్చారు. సాయంత్రం వేళ అంకురారోహణంతో దేవతలను ఆహ్వానించేందుకు పుట్టమన్నును తీసుకువచ్చి సంప్రోక్షణ గావించారు. కాగా మంగళవారం వివిధ పూజలు, హోమాలు ఉంటాయని, సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం ఉంటుందన్నారు. ఉదయం 9గంటలకు కోలాటం పోటీలు ఉంటాయని అందులో పాల్గొనేవారు దేవస్థానం వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆలయ కార్యనిర్వాహకులు తెలిపారు.

పది పరీక్షలకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయండి

చెన్నూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పది పరీక్షలు ఈ నెల 17 నుంచి జరుగతున్నందున పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని స్థానిక సీఐ పురుషోత్తంరాజును బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పద్మనాభయ్య కోరారు. ఈ మేరకు సోమవారం పోలీసుస్టేషనులో సీఐను కలిసి మాట్లాడారు. ప్రస్తుతం చెన్నూరులో ఉన్న పరిస్థితులు దృష్ట్యా విద్యార్థుల తల్లిదండ్రులు కూడా కేంద్రాల వద్ద ఏమైనా సమస్యలు ఉంటాయాని భయపడుతున్నారని గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. ఇబ్బందికర పరిస్థితులు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తామని సీఐ తెలిపారు.

బ్రౌన్ గ్రంథాలయం సందర్శించిన నెడ్‌క్యాప్ అధికారి

కడప కల్చరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి):నగర ఎరముక్కపల్లెలో ఉన్న సీపీ బ్రౌన్ బాషా పరిశోధన కేంద్రం గ్రంథాలయాన్ని సోమవారం నెడ్‌క్యాప్ డెవలప్‌మెంటు ఆఫీసరు యల్లారెడ్డి సందర్శించారు. అక్కడ గల పుస్తక భాండాగారాన్ని నిశితంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యుడు జానుమద్ది విజయభాస్కర్, సహాయకులు హరి భూషణరావు, జూనియర్ అసిస్టెంట్ వెంకటరమణ, సిబ్బంది హరి పాల్గొన్నారు.

ప్రజాపరిష్కార వేదికకు అర్జీలు

పులివెందుల టౌన్, మార్చి 10, (ఆంధ్ర జ్యోతి):స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీలు వచ్చాయి. తహసీల్దారు నజీర్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రజాదర్బారులో పొలాల కొలతలు, రీసర్వే రేషన్‌కార్డులు తదితర సమస్యలపై అర్జీలు అందాయి. ఎన్నికల ఆర్‌ఐ క్రిష్ణమోహన్, ఆర్‌ఐ షేక్షావలి, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.32లక్షల బకాయిలు వసూలు చేయాలి

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): చికెన్ వ్యర్థాలకు సంబంధించి రూ.32లక్షల బకాయిలను వసూలు చేయాలని 21వ డివిజన్ కార్పొరేటర్ ఎం.సుజాత డిమాండ్ చేశారు. కాలపరిమితి పూర్తయినప్పటికీ కూడా ఎలా కొనసాగుతున్నాడని ప్రశ్నించారు. టెండర్‌దారునికి కార్పొరేషన్ అధికారులు వత్తాసు పలుకుతున్నారని మండిపడ్డారు. సోమవారం కడప కార్పొరేషన్ వీడియో కాన్ఫిరెన్స్ హాల్లో జరిగిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమలో కమిషనర్ మనోజ్‌రెడ్డికి ఆమె వినతిపత్రం సమర్పించారు.

మోక్ష నారాయణ స్వామి ఆలయంలో ఏకాదశి ఉత్సవాలు

కమలాపురం రూరల్, మార్చి 10 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలో రామాపురం క్షేత్రంలో నిత్య కల్యాణ మూర్తులుగా వెలసిన మహాలక్ష్మి సమేత మోక్ష నారాయణస్వామివల్లి దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి వార్ల ఆలయంలో ఏకాదశి వేడుకలు ఆలయ నిర్వాహకుడు సాయినాథ్‌శర్మ సమక్షంలో వైభవంగా నిర్వహించారు. ఉత్తర ద్వారం ద్వారా ఆలయంలోకి భక్తులు ప్రవేశించి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేకంగా అభిషకం, కల్యాణం నిర్వహించారు. సాయంత్రం మహాలక్ష్మి సమేత మోక్ష నారాయణస్వామి వార్లు గరుడ వాహనంపై మాడవీధుల్లో విహరించారు.

ప్రతి అర్జీ క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

కడప ఎర్ర ముక్కపల్లె, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి అర్జీని క్షేత్ర స్థాయిలో పరిశీ లించి పరిష్కరిం చాలని కమిషనర్ మనోజ్ రెడ్డి తెలిపారు. సోమ వారం కడప కార్పొరేషన్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కారం వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ 30 అర్జీలు వచ్చాయని, వాటిని పరిశీలించి సంబంధిత అధికారులకు పంపినట్లు తెలిపారు.

'ఎన్టీఆర్ విగ్రహాన్ని ప్రారంభించండి'

వేంపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : వేంపల్లిలో 7 సంవత్సరాలకు పైగా ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటుచేశామని, ప్రారంభించేందుకు రావాలని నారాలోకేశ్‌కు టీడీపీ నేతలు విజ్ఞప్తి చేశారు. సోమవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో అనంతపురం జిల్లా నుంచి కడపకు వెళుతున్న లోకేశ్‌కు వేంపల్లి ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, మండల కన్వీనర్ మునిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రామగంగిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు భద్ర, వేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

హిందువులపై దాడి బాధాకరం

శాంతియుత ర్యాలీలో చాగలమర్రి భారతానందస్వామీజీ



కడపలో శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కడప మారుతీనగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రాయచోటిలో హిందువులపై జరిగిన దాడి బాధాకరమని చాగలమర్రి భారతానంద స్వామీజీ పేర్కొన్నారు. రాయచోటి వీరభద్ర స్వామి పార్వేట ఉత్సవం రోజున హిందువులు సాగిస్తున్న పార్వేట ఉత్సవంలో అన్యమతస్థులు కావాలని కుట్రపూరితంగా దాడి చేయడం సరైంది కాదన్నారు. ఇందుకు నిరసనగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మృత్యుంజయకుంట శివాలయం నుంచి నగర పురవీధుల్లో శాంతియుత నిరసన ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే రాయచోటి సంఘటనను దర్యాప్తు చేసి అక్రమంగా హిందువులపై పెట్టిన కేసును వెంటనే ఉపసంహరించకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు బెస్తవేముల రామ్‌మహేశ్, బీజేపీ కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచార కమిటీ రాష్ట్ర కన్వీనరు సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, బీజేవైయం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, నాయకులు సురేంద్ర, కడప బీజేపీ పార్లమెంటు కన్వీనరు బొమ్మన సుబ్బరాయుడు, ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టరు వంగల శశిభూషణ్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, వీహెచ్‌పీ నాయకులు, కార్యకర్తలు, హిందూ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు.

రేషన్ బియ్యం కోసం పాట్లు

- రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం.. లబ్ధిదారులకు శాపం
- 10వ తేదీ దాటినా అందని బియ్యం
- తెల్లవారుజామునుంచే క్యూలోసంచులు పెట్టి... లబ్ధిదారుల ఎదురుచూపులు
- 8నెలలుగా రేషన్ పంపిణీ చేయని ఎండీయూ వాహనాలు
- ఆపరేటర్ లేకనే పంపిణీ ఆలస్యమంటున్న డీలర్లు

ఎర్రగుంట్ల, మార్చి 10(ఆంధ్యజ్యోతి): రేషన్ బియ్యం సకాలంలో సక్రమంగా అందక పేదలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. 10వ తేదీ దాటినా చాలా చోట్ల రేషన్ అందడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎర్రగంట్ల నగరపంచాయతీలోని 5, 6, 9 రేషన్ షాపులకు సంబంధించి ఎండీయూ వాహనం గత 8 నెలలుగా ఇళ్లవద్దకు రావడంలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. దీంతో కూలి పని పోగొట్టుకుని రేషన్ కోసం పడిగాపులు కాయాల్సి వస్తోందంటున్నారు. 9వ నెంబరు రేషన్ షాపు వద్ద సుమారు వందమందికి పైగా రేషన్ బియ్యం కోసం క్యూలైన్లలో మండు టెండలో పడిగాపులు కాశారు. రంజాన్ ఉపవాసాలతో మండుటెండలో మూడుగంటలుగా నిల్చున్నామని అయినా ఎప్పుడు రేషన్ ఇస్తారో తెలియని పరిస్థితి నెలకొందని పలువురు మహిళలు పేర్కొన్నారు.

లాగిన్ ఒకరిది..పంపిణీ మరొకరిది

నగర పంచాయతీలని 5, 6, 9 రేషన్ షాపులకు సంబంధించిన ఎండీయూ ఆపరేటర్‌కు రెవెన్యూ అధికారులు లాగిన్ ఇచ్చారు. అయినా అతను వాహనాన్ని ఇళ్లవద్దకు తీసుకెళ్లి రేషన్ పంపిణీ చేయడంలేదు. సుమారు 1800 రేషన్ కార్డులున్న మూడు రేషన్ షాపులకు ఒకే లాగిన్ ఉన్న వ్యక్తి ఉండటం, అతను మరోచోట పనికి వెళ్లి మరొకరికి లాగిన్ ఇచ్చి పంపిణీ చేయడం గమనార్హం.


తెల్లవారుజామునుంచి బియ్యం సంచులు క్యూలో పెట్టి రేషన్ కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

- రేషన్ పంపిణీచేయాల్సిన ఎండీయూ వాహనాలు కొన్ని అసలే తిరగడంలేదు. అధికారులు మాత్రం బిల్లులు చెల్లిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

అందరూ ఒకే షాపు వద్దకు రావడంతో సమస్య

మా ఎండీయూ ఆపరేటర్ పరిధిలో మూడు రేషన్ షాపులున్నాయి. మిగతా రెండు షాపుల లబ్ధిదారుల కూడా మా వద్దకే అధికంగా వస్తున్నారు. దీంతో మాకు ఒక్కసారిగా రద్దీ పెరిగిపోతోందని 9రేషన్‌షాపు డీలర్ పేర్కొన్నారు. మా షాపు పరిధిలో ఉన్న వారికి ఇతర షాపులు ఇవ్వడం లేదని లబ్ధిదారులు చెబుతున్నారు. దీంతో సమస్యలు తలెత్తాయి.

సక్రమంగా బియ్యం పంపిణీ చేసేలా చర్యలు

ఎర్రగుంట్ల నగర పంచాయతీలో సక్రమంగా బియ్యం పంపణీ అయ్యేలా చర్యలు తీసుకుంటాం. మండలంలో 12ఎండీయూ వాహనాలున్నాయి. వాటిలో పట్టణంలో రెండు పనిచేయడంలేదు. అన్నింటికి బిల్లులు చెల్లిస్తున్నాం. ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేయాలి. కానీ చేయడం లేదు. అలా జరగకుండా చర్యలు తీసుకుంటాం.

-శోభన్‌బాబు, తహసీల్దార్, ఎర్రగుంట్ల

ఎస్సీ హాస్టళ్లు ఏర్పాటు చేయాలి

కొండాపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపురం, తాళ్లప్రొద్దుటూరు గ్రామాలలో ఎస్సీ హాస్టళ్లు ఏర్పాటు చేయాలని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు జిల్లా జాయింట్ కలెక్టర్ అతిథిసింగ్‌ను కోరారు. కడప కలెక్టరేట్ సభాభవనంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదికలో ఆమేరకు వారు జేసీకి వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో ఈ రెండు గ్రామాలలో మూడు ఎస్సీ హాస్టల్స్ ఉండేవని గ్రామాలు గండికోట ప్రాజెక్టు కింద ముంపునకు గురైన తర్వాత వాటిని ఎత్తివేశారన్నారు.. సర్వం కోల్పోయిన ముంపువాసులు ప్రస్తుతం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా దళిత పిల్లలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండలంలో మూడు ఎస్సీ హాస్టళ్లను తిరిగి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని జేసీ ని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు మనోహర్‌బాబు, వెంకటరమణ, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో డ్రైనేజీకి రూ.50లక్షలు మంజూరు

ఎర్రగుంట్ల, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్లలో డ్రైనేజీ నిర్మించేందుకు రూ.50లక్షలు కలెక్టర్ మంజూరు చేసినట్లు కమిషనర్ పేర్లి శేషఫణి తెలిపారు. ఈనిధుల్లో నుంచి రూ.39లక్షలతో వేంపల్లి ప్రధానరోడ్డులో ఇరువైపులా డ్రైనేజీ నిర్మించేందుకు అతి త్వరలో టెండర్లు పిలుస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే రూ.11లక్షలతో శ్మశానవాటికలో ఉన్న నీటి ట్యాంకుకు కడప రోడ్డులో ఉన్న సంప్‌కు పైప్‌లైన్ వేసి కనెక్షన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. దీంతో ట్యాంకు నుంచి ఇకపై నీటిని వదులుతామన్నారు.

షాదీఖానా మరమ్మతులకు ప్రతిపాదనలు

దువ్వూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు సమీపంలోని పెరోరీస్వామి దర్గా వద్ద ఉన్న షాదీఖానా మరమ్మతులు అభివృద్ధి పనుల నిమిత్తం రూ.25 లక్షలతో ప్రతిపాదనలు పంపినట్లు మండల పంచాయతీరాజ్ ఏఈ సుబ్రమణ్యం తెలిపారు. ఈ ముస్లిం వెల్ఫేర్ ఫండ్ కింద ఈ పనులు చేపట్టాల్సి ఉందని సందర్భంగా ఆయన తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు నిబంధనల మేరకు నెలకు రూ.16 వేలు వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రభుత్వ ఆస్పత్రి పారిశుధ్య కాంట్రాక్టర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల కాంట్రాక్టర్ కార్మికులకు నెలకు రూ.12 వేలు వేతనం చెల్లించి అన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. కాంట్రాక్టర్ కొంతమంది కార్మికులకు సంవత్సరాల తరబడి పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించడంలేదని, ఆ కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్టులో పెట్టాలని కోరారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన చేపడుతామని పేర్కొన్నారు.

బావి స్థలం ఆక్రమణపై విచారణ

అట్లూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అట్లూరు మండలం వేములూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు రాచంరెడ్డి వెంకటరెడ్డి టీడీపీ నాయకుడు పూల వెంకటసుబ్బారెడ్డి భావి స్థలాన్ని ఆక్రమణల నుంచి కాపాడాలని ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం తహసీల్దారు సుబ్బలక్షుమ్మ విచారణ చేపట్టారు. అట్లూరు ఎస్ఐ రామక్రిష్ణతో గ్రామానికి వెళ్లి పరిశీలించారు. ఇది ప్రభుత్వ స్థలమని ఎవరైనా ఆక్రమణలకు ప్రయత్నిస్తే కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ హెచ్చరించారు.

వ్యక్తిపై దాడి కేసు నమోదు

పోరుమామిళ్ల, మార్చి 10, (ఆంధ్ర జ్యోతి): తన స్వగ్రామానికి స్కూటీపై వెళుతున్న వ్యక్తిని గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు కర్రలతో దాడి చేశారని ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఆర్వీ కొండారెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి టేకూరుపేట ఎస్సీ కాలనీకి చెందిన ముత్యాల చెంద్రాయుడు ఇంటికి వెళుతుండగా కొండుగారిపల్లె గ్రామంలోని బ్రిడ్జి సమీపంలో ముగ్గురు వ్యక్తులు కర్రలతో దాడి చేసి గాయపరిచారని, గాయపడ్డ వ్యక్తి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిబంధనలు పాటించని కళాశాలపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పెద్దశెట్టిపల్లెలోని నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్న ఓ ఫార్మసీ కళాశాలపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దారు గంగయ్యకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు జగన్ మాట్లాడుతూ కళాశాలలో తగినంతమంది అధ్యాపకులు లేరని, సీనియర్ విద్యార్థులు తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. బిల్డింగ్ అప్రూవల్ లేకుండానే భవనాన్ని నిర్మించి నర్సింగ్ కళాశాలను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.

వైభవంగా ధ్వజారోహణ

బద్వేలు రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లక్ష్మిపాలెం గ్రామంలో ఉన్న శ్రీలక్ష్మి ప్రసన్న వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వైభవంగా ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రాత్రి శేష వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు.

పోలీస్ స్టేషన్ చేరిన ప్రశ్న పత్రాలు

ముద్దనూరు మార్చి10(ఆంధ్రజ్యోతి):పది పరీక్షలకు సంబంధించి ప్రశ్న పత్రాలు సోమవారం పోలీస్ స్టేషన్‌కు చేరాయి.సెట్-1కు సంబంధించి7 ప్రశ్న పత్రాలు, ఒకేషనల్ కోర్సుకు సంబంధించి ఒకటి మొత్తం 8 ప్రశ్న పత్రాలు వచ్చాయని అధికారులు తెలిపారు. వాటిని ప్రశ్న పత్రాలను ప్రత్యే బాక్సులలో భద్రపరిచారు.

గంగ జాతర విషయమై చర్చలు

పెద్దముడియం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బోడితిప్పనపల్లెగ్రామంలో గంగ జాతర జరపాలన్న విషయంపై ఇరువర్గాలతో తహసీల్దారు బాలనరసింహులు, పోలీసు అధికారులు సోమవారం చర్చలు జరిపారు. ఒక ఏడాది గంగ జాతర నిలపాలని ఓ వర్గం అలా ఆపడం కుదరదు, అనుకున్న సయానికి జాతర చేయాలని మరో వర్గం పట్టుపడుతున్న తరుణంలో అధికారులు చర్చలు జరిపారు.

ఇష్టంతో చదవండి

జమ్మలమడుగు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఇష్టంగా చదవండి, ఆత్మహత్యలు వద్దు, బతికి సాధిద్దాం అని జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యార్థుల అభివృద్ధికి చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు.

ప్రపంచంలో అత్యంత విలువైనది సమానత్వమే


సభలో మాట్లాడుతున్న విప్లవ రచయిత్రి పి వరలక్ష్మి

ప్రొద్దుటూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) :ప్రపంచంలో అత్యంత విలువైనది సమానత్వమేనని విప్లవ రచయితల సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి పి వరలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం స్థానిక హనుమాన్‌నగర్‌లో చైతన్య మహిళా సంఘం ఆధ్వర్యంలో చదువల తల్లి సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సదస్సునుద్దేశించి వరలక్ష్మీ మాట్లాడుతూ స్త్రీలకు పురుషులతో పాటు సమాన హక్కులు సాధించడంలో సావిత్రిబాయి పూలే పోరాటం ఘననీయమైనదన్నారు. చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పద్మ మాట్లాడుతూ మహిళలు సామాజిక చైతన్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ప్రముఖ వైద్యులు వరుణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ స్త్రీలు అన్ని రంగాలను శాసిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మెప్మా సీవోలు విమల, శ్రీదేవి రసూలమ్మ, ఆర్పీల సంఘం అధ్యక్షు రాలు తనికంటి లక్ష్మీదేవి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ చంద్రావతి పాల్గొన్నారు.

ధీర వనిత సావిత్రిబాయి పూలే

ప్రొద్దుటూరు , మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యమవుతుందని గుర్తించి పోరాడిన ధీర వనిత సావిత్రిబాయి పూలే అని రాయలసీమ మహిళా శక్తి రాష్ట్ర కార్యదర్శి వడ్ల లక్ష్మీదేవి పేర్కొన్నారు.. సోమవారం స్థానిక సృజనా సామాజిక కార్యాలయంలో సావిత్రి పూలే చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సృజనా సామాజిక వేదిక కన్వీనర్ శ్రీనివాసులరెడ్డి, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి మురళీ, మహిళా శక్తి సభ్యురాలు ప్రసన్న, విద్యార్థి శక్తి కన్వీనర్ హరిత రుక్సానా తదితరులు పాల్గొన్నారు. స్థానిక బీసీ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ ప్రజా చైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు పూలే చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సమాఖ్య కార్యదర్శి దేవేంద్రుడు, శ్రీను, సంటెయ్య, మల్లికార్జున ,ఈశ్వరయ్య, పుల్లయ్యలు పాల్గొన్నారు.

తొలి మహిళా ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే


పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

బద్వేలు, మార్చి10, (ఆంధ్రజ్యోతి): స్త్రీ విద్యాభివృద్ధి కోసం కృషిచేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే అనిసాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గురుమూర్తి పేర్కొన్నారు. సోమవారం సావిత్రి బాయి పూలే 128వవర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని ఆమె విగ్రహా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన యోగివేమన విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యుడు చిన్నసుబ్బారావు మాట్లాడుతూ స్త్రీ విద్యకు పాటుపడిన గొప్ప మహిళ అని కొనియా డారు. కార్యక్రమంలో బద్వేలు పట్టణ అభివృద్ధి సొసైటీ అధ్యక్షుడు నానబాల వెంకటేశ్వర్లు, జాతీయ బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు సుబాన్ బీ, పూలేఅంబేద్కర్ రాజ్యాధికారసమితి నేత పిచ్చయ్య, పాల్గొన్నారు.

యువత పోరును జయప్రదం చేయండి

బద్వేలు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యువతను, నిరుద్యోగులను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం వైఖరిని నిరసిస్తూ ఈ నెల 12వ తేదీ చేపట్టనున్న యువత పోరును జయప్రదం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిలు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు విలేకర్ల సమావేశం నిర్వహించారు. అనంతరం యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డివైస్ చైర్మన్ సాయిక్రిష్ణ, యద్దారెడ్డి పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో: వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు ఈనెల 12న నిర్వహించే యువత పోరుకు వైసీపీ కార్యకర్తలు తరలిరావాలని జమ్మలమడుగు మాజీ ఎంఎల్ఏ డాక్టర్ సుధీర్‌రెడ్డి కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. సోమవారం పార్టీ కార్యాలయంలో యువతపోరుకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో: వైసీపీ పిలుపుమేరకు ఈనెల 12వ తేదీ యువత పోరు జరగనుందని ఆ పార్టీ నాయకుడు పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం జమ్మలమడుగు వైసీపీ కార్యాలయంలో యువత పోరు సంబందించి కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో యువకులు, అభిమానులు, హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పోరెడ్డి మహేశ్వరరెడ్డి, గజ్జల లక్షుమయ్య, దన్నవాడ మహేశ్వరరెడ్డి, ఉప్పలపాడు గురప్ప, గొరిగెనూరు బోనం సురేష్, బాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. వాసవాంబ కల్యాణోత్సవం


వాసవాంబ కల్యాణాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మెయిన్‌బజార్‌లోని అమ్మవారిశాలలో వాసవాంబ కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా కనుల పండువగా నిర్వహించారు. ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన కళ్యాణ మంటపం ప్రారంభం సందర్భంగా వాసవాంబ కల్యాణోత్సవం అమ్మవారి విశేష అలంకరణతో రిత్వికులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం హోమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. నగరపంచాయతి చైర్మన్ ఎం.హర్షవర్దన్‌రెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి, పురప్రముఖులు, ప్రజాప్రతినిధులు అమ్మవారిని దర్శించుకున్నారు.

దుగ్గనపల్లెను కమ్ముకున్న దుమ్ము, కాలుష్యం

- ఆదుకోవాలంటూ ఆర్డీవోకు మొరపెట్టుకుంటున్న బాధితులు


ఆర్డీవో సాయిశ్రీకి వినతిపత్రం ద్వారా సమస్యలు విన్నవిస్తున్న బాధితులు

జమ్మలమడుగు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): దుగ్గనపల్లెను కమ్ముకున్న దుమ్ము, కాలుష్యం నుంచి కాపాడాలని గ్రామానికి చెందిన బాధితులు జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీని కోరారు. ఆమేరకు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరష్కార వేదిక కార్యక్రమానికి ఇటీవల మైలవరం మండలం దుగ్గనపల్లె గ్రామంలోని మిరప పంట పొలంలో ఆత్మహత్య చేసుకున్న మోష కుటుంబ సభ్యులు ఆర్డీవోను కలిసి న్యాయం చేయాలని వినతిపత్రం ద్వారా మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ దాల్మియా పరిశ్రమ పరిసర ప్రాంతాలు గత కొన్ని సంవత్సరాలుగా దుమ్ము, కాలుష్యంతో పంట పొలాలకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. దాల్మియా ఫ్యాక్టరీ వల్ల ఇళ్లు నెర్రెలు చీలుతున్నాయని, భరించలేని కంపుతో తాము ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. వర్షాకాలంలో కొండ ప్రాంతం నుంచి వచ్చిన నీళ్లన్నీ దాల్మియా పరిశ్రమ వద్ద నుంచి వరదనీరు ప్రవహిస్తుండడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు అధికారులకు దాల్మియా యాజమాన్యానికి చెప్పినా తమకు న్యాయం చేయలేదని వాపోయారు. దుగ్గనపల్లె గ్రామంలో 200 ఎకరాలు పట్టా సాగు భూమి, 53 కుటుంబాలు మొత్తం ఎస్సీ కులస్థులమే జీవనం సాగిస్తున్నట్లు ఆర్డీవో ఎదుట వాపోయారు.

నవాబుపేటలో ఆర్డీవో పర్యటన

మైలవరం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): దాల్మియా రెండవ ప్లాంట్ ప్రజాభిప్రాయ సేకరణకు సంబంధించి ఈనెల 27వ తేదీన జరిగే ప్రజాభిప్రాయ సేకరణ విషయమై నవాబుపేట గ్రామంలో సోమవారం జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ పర్యటించారు. తహసీల్దారు లక్ష్మినారాయణతో కలిసి నవాబుపేట గ్రామంలో దాల్మియా ప్లాంట్‌కు సంబందించి ప్రజల సమస్యలు, అభిప్రాయాలు, సలహాలు, సూచనలు ఆర్డీవో అడిగి తెలుసుకున్నారు. అనంతరం దాల్మియా బ్లాస్టింగ్ వలన ఇళ్లు నెర్రెలు చీలి దెబ్బతిన్న గృహాలను ఆమె పరిశీలించారు. అనంతరం గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించి వారితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, నాయకులు సుధాకర్‌రెడ్డి, రఘునాథరెడ్డి, తదితర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు


ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

బద్వేలు, మార్చి10, (ఆంధ్రజ్యోతి): అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నేతలు పేర్కొన్నారు. ఆ మేరకు సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. గత సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా 42 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం అంగీకరించిన వాగ్దానాలను అమలు చేయాలని లేనిపక్షంలో విజయవాడలో నిర్వహించతలపెట్టిన మహాధర్నా కార్యక్రమాన్ని చేపడతామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు పేర్కొన్నారు. ఈ మహాధర్నా కార్యక్రమాన్ని రాష్ట్రప్రభుత్వం అణచివేయాలని చూడడం దుర్మార్గచర్య అన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని లేనిపక్షంలో మరో పోరాటానికి సన్నద్ధం కావాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షురాలు సుభాషిణి, ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి హుస్సేనమ్మ, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

కొండాపురంలో: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు నిరసన వ్యక్తం చేశారు. చలో విజయవాడ కార్యక్రమానికి వెళుతున్న అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలను పోలీసులు అడ్డుకోవడం దారుణమన్నారు. జీతాలు పెంచాలని, గ్రాట్యూటీ పెంచాలని తదితర సమస్యలతో వారు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు తారాదేవి, డేరాజ్యోతి, పద్మావతి,శివపార్వతి, రామతులసి ,రాణి తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు రూరల్‌లో : జీతాలు పెంచాలంటూ చలో విజయవాడ కార్యక్రమానికి వెళుతున్న అంగన్‌వాడీ టీచర్లను ఆదివారం పోలీసులు అడ్డుకోవడం దారుణమని ఆ సంఘం నేతలు పేర్కొన్నారు. ఆమేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దార్ నరేంద్ర రాజసింహకు వినతిపత్రం అందజేశారు.

చాపాడులో:స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదురుగా అంగన్వాడీ కార్యకర్తలు సోమవారం ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం వారికి జీతాలు పెంచాలని, పనిభారం తగ్గించాలని కోరారు. ఎన్నికలసమయంలో ఇచ్చిన హామీ నెరవేర్చాలని కోరారు. అంగన్వాడీ కార్యకర్తలు విజయవాడకు దర్నాకోసం వెళితే పోలీసులు అడ్డుకోవడం, అరెస్టు చేయడం తగదని వారన్నారు. తర్వాత తహసీల్దారు రమాకుమారికి వినతి పత్రం అందజేశారు.

అందుబాటులో ప్రకృతి వ్యవసాయ కూరగాయలు

ముద్దనూరు మార్చి10(ఆంధ్రజ్యోతి):స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం వద్ద గర్భిణల కోసం ఆరోగ్యకరమైన ప్రకృతి వ్యవ సాయంతో పండించిన కూరగాయాలు అందుబాటులో ఉంచామని వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డి, డాక్టర్ నాగార్జున పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం వద్ద సోమవారం ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కూరగాయల విక్రయ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రతి నెల 9 వ తేదీన ప్రకృతి వ్యవసాయం పద్ధతిన పండించిన కూరగాయలు, ఆకు కూరలు విక్రయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నూజహత్,రామసుధ,మునిభూపాలుడు, మేరి ,ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

రంపాడు గ్రామసచివాలయానికి సిబ్బంది కొరత


రంపాడు గ్రామసచివాలయం

కాశినాయన మార్చి10(ఆంధ్రజ్యోతి): ఓబుళాపురం మూడురోడ్ల కూడలిలో ఉన్న రంపాడు గ్రామసచివాలయానికి సిబ్బంది కొరత వేధిస్తోంది. మండల కేంద్రానికి ముఖద్వారం అయిన ఓబుళాపురంలో గిద్దలూరు పోరుమామిళ్ల ప్రధాన రహదారి సమీపంలోనే సచివాలయం ఉంది. ఇందులో కీలకమైన పంచాయతీ సెక్రటరీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్, వెల్‌ఫేర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కాగా ఇటీవల ఇక్కడ పనిచేస్తున్న డిజిటల్ అసి స్టెంట్ గత నెల రోజులుగా విధులకు గైర్హాజరవుతుండడంతో ఉప్పలూరు ,రంపాడు పం చాయతీల్లోని 5గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నా రు. కొన్ని పోస్టులకు పక్కపంచాయతీల నుంచి ఇంచార్జిలుగా నియమించినా వారు ఇక్క డికి రావడంలేదనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి రంపా డు గ్రామసచివాలంలో ఉన్న ఖాళీలను భర్తీచేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎండీవో ఏమన్నారంటే..:రంపాడు సచివాలయంలో సిబ్బంది కొరత ఉన్న విషయం వాస్తమేనని కాశినాయన ఎంపీడీవో మైథిలి పేర్కొన్నారు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సిబ్బంది నియామకం జరిగేలా చూస్తామన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు


దొబ్బుడుపల్లె రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న టీడీపీ ఇన్‌ఛార్జ్ భూపేశ్‌రెడ్డి

కొండాపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) మండలం లో దొబ్బుడుపల్లె, రాగికుంట గ్రామాలలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలను సోమవారం వైభవంగా నిర్వహిం చారు. దొబ్బుడుపల్లెలో రామాలయ విగ్రహ ప్రతి ష్ఠ నిర్వహించగా, రాగికుంటలో బసవేశ్వరస్వామి శివలింగ విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ ఉత్సవాలలో జమ్మలమడుగు టీడీపీ ఇన్ చార్జ్ భూపేశ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఆలయ నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మం డల కూటమి ఇన్‌ఛార్జ్ శివనారాయణరెడ్డి, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

ఎర్రగుంట్ల, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల పద్మావతిపురంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ 11వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు తెల్లవారుజామున స్వామివారికి అభిషేకం, హోమాలు నిర్వహించారు. 11గంటలకు స్వామివారి కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం కల్యాణం తిలకించిన భక్తులకు స్వామిరి తీర్థప్రసాదాలను పంపిణీతోపాటు మధ్యాహ్నం స్వామివారి అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివార్ల ఉత్సవ విగ్రహాలను పురవీధుల గుండా ఊరేగించారు. స్వామివారికి భక్తులు కాయకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.